POSTAL REGD.NO.PRAKASAM/16/2021-2023
REGD.NO. 37926/83
ESTABLISHED : 1983
ఏప్రిల్ 2022
వెల – ₹ 10.00

# సాయిబాబా

ఆధ్యాత్మిక వైజ్ఞానిక మాసపత్రిక

సంపుటి: 39 సంచిక: 12



పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ గురుదేవుల ఆరాధన మహోత్సవము

(12-4-2022)



# ప్రార్థన ఎందుకు, ఎలా చేయాలో తెలుసా?

*పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ*

"ప్ర+అర్థన" అంటే హృదయపూర్వకంగా, భగవంతునిపై భక్తిశ్రద్ధలతోనూ మరియు మనం కోరే లక్ష్యంపై నిజమైన ప్రీతితో భగవంతుని కోరుట అని అర్థం. మొదట భక్తి వుండాలి; భగవంతుడు వున్నాడన్న నిశ్చయము, ఆయనను గురించిన స్పష్టమైన అవగాహన వుంటే గాని భక్తి కుదరదు. అన్వేషణ వుంటే గాని నిశ్చయం కల్గదు. అటు తర్వాత ఇంద్రియాలకు, మనసుకూ అతీతుడైన పరమాత్మ సద్గురువుగా తారసిల్లుతేగాని ఆ భక్తికి స్థిరం చిక్కదు. అటు తర్వాత బాగా ఆలోచిస్తే గాని ఆయనను కోరదగినదేదీ సరిగా అర్థమవదు. మహరాజు అత్యంత ప్రీతితో మనమేది అడిగినా ఇస్తానంటే ఒక్క ఎంగిలి బీడి చాలునన్నట్లు ఏది లభించితే మన దరిద్రం తీరదో అట్టివే కోరుతుంటాము. అటువంటప్పుడు మన ప్రీతి భగవంతుని పైగాక, మనముకోరే క్షుద్రమైన వస్తువుల పట్లే నిలుస్తుంది. కాని భగవంతుడు అనన్యంగా ప్రీతితో ఆయనను స్మరిస్తేనే మన యోగక్షేమాలు చూచుకుంటానన్నాడు. అల్పమయినవి ఏవో కోరితే – అవి పూర్వపుణ్యముంటే నెరవేరుతాయి. లేకుంటే నెరవేరవు; నెరవేరినా ఇంకా ఇంకా దేబిరిస్తుండడం తప్పనిసరి అవుతుంది. చివరకు ఆ క్షుద్రమైన ఆశయాలపై కోరికలతో అసత్యము, దొంగతనము, అసూయవంటివి ప్రబలి మనను భగవంతుడి నుంచి దూరం చేస్తాయి.

ప్రార్థన బలమైన మందు వంటిది; రెండువైపులా పదునున్న కత్తి. రాక్షసులకు వినాశము, కొందరికి నరకము మరియు హీన జన్మలు, కొందరికి స్వర్గము బహుకొద్ది మందికి మోక్షముగూడ ప్రార్థనే ప్రసాదించింది. సరిగా చేస్తే ప్రార్థన వలన నానాటికి వినమ్రత కల్గుతుంది. మనమెంత సామాన్యులమో, భగవంతుడు లేక సద్గురువు ఎంత ఉత్తముడో నానాటికీ అవగతమవుతుంటుంది. ఆయన చెప్పినది జవదాటడం నానాటికి మరీ భయంకరమవుతుంది.

అదే ప్రార్థన సరియైన అవగాహనతో చేయకుంటే మనము భక్తులము, సాధకులము, జ్ఞానులము అని, ఇతరులు అల్పులని అహంకారము బలసిపోతుంది. ప్రజలు ఎవరినైనా అధికులుగా భావిస్తే మన కొంప కూలినంత కడుపు మంటరేగుతుంది. ఇదే వశిష్ఠులవారి 100 మంది కొడుకులను విశ్వామిత్రుడు చంపేలా చేసింది!

హృదయగతమైన నిరంతర ప్రార్థనే (అది సవ్యమైనా కాకున్నా) – తపస్సు! అందుకే సాధకుడు ఎప్పుడూ భగవంతుని పట్ల ద్వైతభావాన్ని దాస్య భావాన్ని వ్యక్తం చేసే ప్రార్థనలే చేయాలి. అందుకే సాయి మనకు మార్గం చూపుతూ, "నేను భగవంతుని బానిసను, భగవంతుడే సర్వానికీ యజమాని" అనే ప్రార్థనే నిరంతరము చేస్తుండేవారు. ఆయనంతటివారే అలా చేస్తే మనమెలా చేయాలో

ఆధ్యాత్మిక వైజ్ఞానిక మాసపత్రిక

# సాయిబాబా

OFFICIAL ORGAN OF SRI MANGA BHARADWAJA TRUST

సంపుటి:39 ఏప్రిల్-2022 సంచిక:12

పరమపూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజగారిచే స్థాపించబడిన ఏకైక పత్రిక, మన 'సాయిబాబా'

## విషయ సూచిక


| | | | |
|---|---|---|---|
| 01. | **ప్రార్థన ఎందుకు, ఎలా చేయాలో తెలుసా?** | పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ | 03 |
| 02. | **పరిప్రశ్న** | పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ | 06 |
| 03. | **వంతెన మీద ఎవరూ ఇల్లు కట్టుకోరు** | పూజ్య గురుపత్ని శ్రీ అలివేలు మంగమ్మ | 07 |
| 04. | **సిద్ధయ్య** | శ్రీమతి శ్రీదేవి | 10 |
| 05. | **వార్తాలాపము** | శ్రీమతి అడిదం వేదవతి | 12 |
| 06. | **మాతృదేవి స్మృతులు** | శ్రీమతి సరోజిని జాలారావు | 15 |
| 07. | **సాయీ కా బేటా** | శ్రీ సుబ్బరాజు | 19 |
| 08. | **రాధాకృష్ణ ఆయీ** | పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ | 22 |
| 09. | **ద్వారకామాయి అనుభవమండపము** | ఒక సాయి భక్తుడు | 25 |
| 10. | **ఆచార్యుని అద్భుత లీలలు** | శ్రీ వెంకటేశ్వరరావు | 26 |


చిరునామా

Sri Manga Bharadwaja Trust,
Bhakta Nivas, 12-1-170/46P, Hanuman Nagar,
Jaipuri Colony, Nagole, Hyderabad - 500068
Phone No. +91 - 74160 41550

**www.saibharadwaja.org**
**www.saimasterforums.org**

చీఫ్ ఎడిటర్: డా॥ ఆర్.ఎస్. శశిధర్, పిహెచ్. డి

చందా వివరములు

విడి ప్రతి : రూ. 10-00
సంవత్సర చందా : రూ. 100-00

సాయిబాబా పత్రికలో వెలువడే వ్యాసాలకు, అభిప్రాయాలకు ఆయా రచయితలే బాధ్యులు.

ఊహించుకోవచ్చు. నమ్మినబంటే క్రమంగా యజమానికి యజమానవుతాడు. కారణం యజమాని సర్వానికీ ఆ బంటుపై ఆధారపడతాడు. అతడు చెప్పినదల్లా వింటాడు. అందుకు బహుమతిగా తన స్థితినే ప్రసాదిస్తాడు.

ఏసుక్రీస్తు మరణం తర్వాత వారి శిష్యులలో ఎవరు నాయకత్వం వహించాలన్న కోరిక తలెత్తింది. ఇంతలో ఏసు ఒక పాత్రతో నీరు తెచ్చి శిష్యులకాళ్ళు కడిగారు. ఆశ్చర్యంతో కారణమడిగిన శిష్యులతో “వినమ్రతతో సేవ చేయడానికి సంసిద్ధులే నాయకత్వానికి అర్హులు, నాయకత్వం కోసం ప్రాకులాడేవారు సేవ చేయటానికి కూడా పనికిరారు” అన్నాడు. రమణమహర్షివంటివారు చెప్పే జ్ఞానమార్గంలో కూడా అత్యంత తీవ్రమయిన దాస్యభావంతో రమణమహర్షివంటి జ్ఞానిని చిరకాలం సేవించాక మాత్రమే ఆయన చేసినట్లు భగవంతుడ్ని ప్రార్థించడం సాధ్యమవుతుంది.

ఇంతకూ సరిగా ప్రార్థన చేయగల్గాలంటే సద్గురువుపట్ల అచంచలమైన భక్తిశ్రద్ధలుండాలి; వారిని కోరదగినదేదో వివేకంతో తెలుసుకోవాలి. తెలుసుకుంటే ఆయనను కోరవలసింది ఏమీ అగుపించదు. వారి అనుగ్రహం వుంటే అన్నీ లభిస్తాయని అర్థమవుతుంది. అట్టి ఆయనను నిరంతరం గుర్తుంచుకోవడమే నిజమైన ప్రార్థన. అట్టి ప్రార్థన మన నడవడిని మన భావాలను సంస్కరిస్తుంది. అందరూ ఆయన రూపాలే అయితే ఎవరిని ద్వేషించగలము, ఎవరిపై పంతమూ



అసూయా వహించగలము. అసూయ మొ॥న భావాలు వ్యర్థములేకగాక, ఎంత అనర్థదాయకాలో నిజంగా తెలిస్తే మన నడవడి ఇలా ఎందుకుంటుంది? సరిగా ప్రార్థన చేయగల్గడమంటే మనం పాత వ్యక్తిత్వం నుండి మరణించి, క్రొత్త వ్యక్తిత్వంలోనికి మరల జన్మించడమే. అదే ద్విజత్వమంటే!! అట్టిది పొందకపోవడమే నిజమైన శూద్రత్వమంటే! “మనతో ఒక హీన జాతివాడు వున్నాడు వాడిని తోలివేయాలి” అన్నారు బాబా. అభిమాన మమకారాలతో అలాంటివారి సాంగత్యము చేయడం కూడా మనలోని అట్టి దుర్గుణాలపై వ్యామోహము మిగిలివున్నట్లే. నిజమైన ప్రార్థనలో భగవంతుని రూపమయిన సద్గురువుయొక్క గుణగణాలను స్మరించాలి, చిత్తశుద్ధితో ఆత్మ పరిశీలన చేసుకొని గుర్తించిన బలహీనతలను పరితాపంతో ఆయనకు మనవి చేసుకుంటే అవి నశించి ఆయనయందే మనస్సు లగ్నమవుతుంది.

నోటితో ప్రార్థన మాత్రం వల్లించి మనోభావాలను, ఆచరణను హీనమైన రీతిన కొనసాగనిస్తే మనను రక్షించడానికి కంకణం కట్టుకొకన్న ఒక్కగానొక్క శక్తిని వంచిప చూచినట్లే. మనలోని బలహీనతలకిచ్చినంత విలువ ఆయనకు ఇవ్వనట్లే! కేవలం ఆయన ప్రేమ స్వరూపం గనుక మనలను చావుదెబ్బ కొట్టకుండా మన అవివేకాన్ని ఉపేక్షించి ఊరకుంటాడు. అపారమైన కరుణతో సద్గురురూపంలో మనల్ని సంస్కరింప చూస్తుంటారు. ఆయననేమి కోరాలి? ఆయనను ఏమైనా కోరడానికి మొహమెలా చెల్లుతుంది. •

# పరిప్రశ్న

**పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ**

***ప్రశ్న:- ఈ మధ్య పెద్దలొకరు శంబళంలో అవతార పురుషుడు జన్మించారని చెప్పారు. అది నిజమేనా? అంటే కలియుగమైపోయి కృతయుగం త్వరలో రానున్నదా?***

**-శ్రీమతి శారదావివేక్**

జవాబు:- ఎంత ఆలోచించినా ఆ విషయం అంత ప్రస్తుతము కాదని నాకు తోస్తుంది. అందులో రెండంశాలున్నాయి.

(1) అవతరించిన మాట నిజమా?
(2) ఆ విషయం మన కెంతవరకూ వుపయోగం?

1) ఇంతకు ముందే ఎన్నోసార్లు 'ఇదిగో అవతరించాడు' అంటే 'అదిగో అవతరించాడు' అంటూ ఎందరో వ్రాశారు. కాని యింతవరకు అవి తృప్తికరంగా నిజమైనదంటూలేదు. శ్రీ మెహర్ బాబాయే యీ యుగావతారమని, శ్రీ సత్యసాయిబాబాయేనని, శ్రీ జిడ్డు కృష్ణమూర్తియే రానున్న అవతార పురుషుడని యిలా యింకెందరి గురించో వారి వారి భక్తులంటున్నారు. కనుక యిలాంటి మాటలు ఎంతవరకూ నిజమో మనకు తెలుసుకునే అవకాశమే లేదు. ప్రతివారు అటు గుడ్డిగా నమ్మటమో, కాదనడమో జరుగుతుంది. ప్రతి భక్తుడు తాను నమ్మిన మహనీయుడే భగవత్స్వరూపమని నమ్మడం సహజం గూడ.

(2) చాలా ఆలోచిస్తే యీ ప్రశ్న అప్రస్తుతమనిపిస్తుంది. ఒకవేళ భగవంతుడవతరించినా ఆయన రక్షించబోయేది శిష్టులనే. అంటే చక్కటి నైతిక వర్తన కలిగియున్న వాళ్ళనే. దైవం అవతరించకున్నా మన కర్తవ్యమదే. ఆ కర్తవ్యం నెరవేర్చినపుడు, భగవంతుడు అవతరించినా, అవతరించకున్నా మనకు ఆయనయొక్క అనుగ్రహం లభిస్తుంది. ఇక మనకు ఆ ప్రశ్న అప్రస్తుతమే గదా!

ఇక యుగాల ప్రసక్తి గూడ అంతే. నైతిక పరివర్తన చెంది సాధన చేసేవారికి యీ కలియుగం చక్కని అవకాశమని, యితర యుగాలలో ఎంతో శ్రమిస్తేగాని రాని సత్ఫలితం యీ యుగంలో స్వల్ప యత్నంతో లభిస్తుందని "శ్రీ గురుచరిత్ర" చెబుతుంది. నిరంతరం భగవంతుని శరణుజొచ్చి స్మరించినవారిని కలిమలం అంటలేదని శాస్త్రం. అంటే సాధన చక్కగా చేసేవారికి కలియుగం గూడ సత్యయుగమే!! అలాగాని వారికి సత్యయుగంలో గూడ కలియుగమే అవుతుంది. త్రేతాయుగంలో రాముని అవతారకాలం గూడ రాక్షసులకు ఏమి వినియోగపడింది కనుక? ఇక రాబోయేది ఏ యుగమైనా మన కర్తవ్యమొక్కటే. ఇటువంటి ప్రశ్నలు సాధననుంచి మనస్సును మరల్చడంకంటే చేయగల్గినదేమున్నది? మనకు లభించిన సమర్థ సద్గురు సాయినాథుని సేవ, చరిత్ర పారాయణ "గురుచరిత్ర" పారాయణలను సార్థకం చేసుకొనడం మనకు చాలు.•

(అక్టోబరు 2011 సాయిబాబా మాసపత్రిక నుండి)

# వంతెన మీద ఎవరూ ఇల్లు కట్టుకోరు

*పూజ్య గురుపత్ని శ్రీ అలివేలు మంగమ్మ*

"వంతెన మీద ఎవరూ ఇల్లు కట్టుకోరు" - పూజ్యశ్రీ మాస్టరుగారి మహత్తరమైన సూక్తి. ఇటువంటి సూక్తి ఇంతవరకూ ఎవరూ చెప్పలేదేమో! కారణం జీవిత సత్యమంతా అందులో ఇమిడి వుంది.

'వంతెన' - దేనినైనా దాటడానికి మాత్రమే ఉపయోగిస్తాము. దీనికి మరొక అర్థం అతిక్రమించడమని కూడా చెప్పుకోవచ్చు.

మానవ జీవితమే వంతెన. దీని ద్వారా జన్మపరంపరలను అతిక్రమించవచ్చు. అలా అతిక్రమించడానికి ఉపయోగపడే పరికరం ఈ జన్మ. ఈ పరికరంతో అతిక్రమించాలి కూడా. కారణం ఇట్టి అవకాశం మరే జన్మ ఎత్తినా రాదు.

అసలు స్వంత ఇల్లు ఎందుకు కట్టుకుంటాము? మనది అనేది మనకొకటి ఎప్పటికీ ఉండాలని. అలాగే మన స్వంతంగా మనకు వుండాలని పొలాలు, స్థలాలు, నగలు, నాణ్యాలు, భార్యాబిడ్డలు మొదలైన వాటినెన్నింటినో సమకూర్చుకుంటాము. అవన్నీ సమకూర్చుకోవడానికి ఎన్నో ప్రయత్నాలు చేస్తాము. చివరకు అన్నీ వదిలి వెళ్ళిపోతాము.

అయితే 'జీవించి వున్నంతకాలం వాటిని సుఖంగా అనుభవిస్తూనే వున్నాంకదా?'అనిమనకనిపించవచ్చు. 'సుఖంగా' అనే మాటకు అర్థమేమిటి? భర్తను లేక భార్యను, బిడ్డలను, పొందినప్పటికీ, ఇల్లు, వాకిలి, నగానట్రా సంపాదించుకున్నప్పటికీ మనం సుఖంగా వుండగలుగుతున్నామా? లేక ఇవన్నీ మనకు వున్నాయనే తృప్తిని మనం పూర్తిగా పొందగలుగుతున్నామా? ఇంకా ఏదో పొందాలన్న ఆశ లేక అసంతృప్తి లేకుండా వున్నాయా? ఈ విషయం కొంచెం ఆలోచిస్తే మనకే అర్థమౌతుంది.

అంటే ఇక్కడ అన్నీ వదులుకుని జీవించాలా? అని మనకనిపించవచ్చు. అలాఅనికాదు.ఇక్కడసుఖశాంతులతో వుండాలనుకోవడం సమంజసమే. వాటికోసం ప్రయత్నించడమూ సమంజసమే. అందుకోసం ఇల్లూవాకిలి, భార్యాపిల్లలు కావాలనుకోవడం కూడా తప్పుకాదు. కానీ వాటి ద్వారా సుఖశాంతులు పొందగలుగుతున్నామా? అన్నది ప్రశ్న. అవి కావాలనుకోవడంలో సుఖశాంతులను కోల్పోవడం ఒక ఎత్తైతే, ఇవి ఉన్నా కూడా సుఖశాంతులు లేకుండా వుండడం మరొక ఎత్తు.

వీటన్నింటికీ మూలకారణం ఏమిటి? మనం రాగద్వేషాదులలో చిక్కి వాటికి సంబంధించిన మానసిక, శారీరక క్రియలలో కొట్టుకుపోవడం. దాని పర్యవసానమే అశాంతి. దాని పర్యవసానమే జన్మపరంపరలు. ఎన్ని జన్మలెత్తినా ఈ అశాంతి తరగడమంటూవుండదు - పెరగడమే తప్ప. ఈ అశాంతికి కారణం ద్వేషమే కానక్కరలేదు, రాగము కూడా అవ్వవచ్చు. ఈ

రాగద్వేషాదులకు అనేకానేక కారణాలు. అనేకానేక పర్యవసానాలు. వీటితో మనిషి ఎవడి స్థాయిలో వాడు అతలాకుతలమైపోతాడు. దానినుంచి బయటపడనూ లేడు. శాంతిగా వుండనూలేడు. బయటపడడానికి పరిష్కార మార్గం గూడా తెలియక, గమ్యం లేక, కోటానుకోట్ల జన్మలెత్తుతూ సుఖదుఃఖాలను అనుభవిస్తూ వుంటాడు. దీనికి అంతెక్కడ? మరి ఈ అశాంతి తీరేదెలా?

అందుకని శాంతిని పొందడానికి మార్గం తెలుసుకోవాలి. మానవజన్మకు మూలమేమిటో తెలుసుకోవాలి. అసలు వంతెనమీద ఇల్లు కట్టుకోవాలనుకోవడమంటే ఏమిటన్నమాట? వంతెన మీదనుంచి దాటి పోకుండా అక్కడే ఎప్పటికీ వుండి పోవాలని అనుకుంటున్నాడన్నమాట. అలాగే మానవజీవితమనే వంతెన మీద "జన్మపరంపరలను దాటిపోకుండా ఎప్పటికీ ఇక్కడే అనేక జన్మలెత్తుతూ వుండాలనుకోవడమన్నమాట. 'ఏమి? ఎన్ని జన్మలైనా ఎత్తవచ్చు. అన్ని విధాలా సుఖపడే జన్మ రావచ్చు కదా! అప్పుడిక్కడే సుఖశాంతులతో వుండవచ్చు కదా!' అనిపించవచ్చు. అది నిజమే గాని సుఖశాంతులతో కూడిన జీవితము రావాలంటే ఏమి చేయాలి? అందుకు మన పెద్దలు ఏమి చెప్పారు? ఆ సుఖశాంతుల కోసం మనం పూజించే దేవతలు, ఆరాధించే మహాత్ములు ఏమి చెబుతున్నారు? వాటి గురించి ఆలోచించి ఆచరించడానికి ప్రయత్నించినప్పుడే సుఖశాంతులు పొందగలుగుతాము.

మనం దేనినైనా మన ఇష్టాయిష్టాలననుసరించే చేస్తుంటాము. ఒక పని ఇష్టమున్నది, చేయాలనుకుంటాము. మరొకటి ఇష్టం లేదు, చేయాలని వుండదు. అలాగే మాటలు, మిగతా అన్ని విషయాలు కూడా. అయితే మనకు ఇతరులతో సంబంధము వుంది గనుక, వారికీ ఇష్టాయిష్టాలు వుంటాయి గనుక, మన ఇష్టాయిష్టాల -- ప్రకారం ప్రవర్తించడానికి అన్నింటిలోనూ అవకాశం వుండదు. అక్కడే వస్తుంది అశాంతి. పోనీ అవతలివారి ఇష్టాయిష్టాల ప్రకారం పోదామంటే అవి సరియైనవని మనకనిపించదు. కనుక చేయాలనిపించదు. కనుక బాహ్యంగా ఘర్షణ పడినా పడకపోయినా మానసికంగా ఘర్షణ తప్పదు. అదే అశాంతికి కారణం. మరి దీనిని అధిగమించడమెలా?

దీనికి పరిష్కార మార్గాలు పెద్దలు అనేక విధాలుగా చెప్పారు. ఏ మార్గం ప్రకారం చూసినా మన ఇష్టాలను వదులుకోక తప్పదు. అంటే ఇష్టాయిష్టాలు వదులుకుంటే గాని శాంతి రాదన్నమాట. 'ఇష్టాయిష్టాలను వదులుకుంటే ఇక జీవిత మేముంది? ప్రతిదీ అవతలివారి ఇష్టం ప్రకారం చేస్తూ పోవడమేనా?' అని అనిపించక తప్పదు.

ఇక్కడ ఇష్టాయిష్టాలను వదులుకోవడమంటే మనకేమీ వద్దని అనుకోవడం కాదు. మనకిష్టమైనవి సంభవించినా, ఇష్టం లేనివి చేయవలసి వచ్చినా, అది మన కర్మ ఫలితంగా వచ్చిందనో లేక భగవంతుడు ప్రసాదించినదనో తలచినట్లైతే వాటి పట్ల సంతోషమూ, బాధా కలుగడము జరుగదు.

అప్పుడు సుఖాలకు పొంగకపోవడమూ, దుఃఖాలకు క్రుంగక పోవడమూ జరుగుతుంది. తరువాత అన్నింటిపట్ల నిర్లిప్త భావం కలుగుతుంది. 'నిర్లిప్తత' అంటే జడత్వము కాదు, శాంతిని పొందడం. అప్పుడు మనం కర్తవ్యాన్ని నిర్వర్తిస్తూ ఫలితాలపట్ల నిర్లిప్తులమై వుంటాము. అందువలన శాంతిని పొందుతాము.

ఈ ప్రపంచంలో ఏదీ శాశ్వతము కాదు. అన్నీ కాలగర్భంలో కలిసిపోవలసిందే. ఎందరో రాజులొచ్చారు, రాజ్యాలకోసం కొట్టుకున్నారు, ఏలారు, పోయారు. అలాగే ఎన్నో కోటానుకోట్ల మానవులు మనలాగే వచ్చారు. అనేక కోరికలతో సుఖదుఃఖాలకు, రాగద్వేషాదులకు లోనైనారు. తగవులు పడ్డారు, గెలిచారు, ఓడారు. తప్పుకోలేని అశాంతితోనే మరణించారు. నేడు మనమూ అంతే.

పది సంవత్సరాల క్రితం ఉన్న సుఖదుఃఖాలను తలచుకుంటే అవి ఎంత అశాశ్వతాలో అర్థమౌతుంది. కొన్ని సుఖాలను పొందినా, దుఃఖాలవలన వచ్చే అశాంతే ఎక్కువ. అంటే తను కావాలనుకున్నదానిని పొందలేకపోవడము, ఇతరులతో నిత్యజీవితంలో వచ్చే చిన్నా, పెద్దా వైషమ్యాలు, తగువులు, మాట పట్టింపులు – వీటన్నింటితో కాలం ఎలా గడిచిపోయిందో సరిగా ఆలోచిస్తే మనకే అర్థమౌతుంది. మనమెంత అజ్ఞానంలో వున్నామో! శాశ్వతమైన శాంతిని పొందే మార్గం కనులముందు కనిపిస్తున్నా దానివైపు కన్నెత్తైనా చూడకుండా ఎలా రాగద్వేషాదులలో అలమటిస్తున్నామో!

అందుకే కాబోలు

మనకోసం మహాత్ములు మన అజ్ఞానాన్ని చూసి ఎంతో ఆవేదన పడతారు, అవతరిస్తారు. దానిని పోగొట్టుకోవడానికి ఎన్నో, ఎన్నెన్నో మార్గాలను చెబుతారు, చూపిస్తారు, ఆచరిస్తారు కూడా. బిడ్డ తనకు పనికిరానిదానికోసం ఏడుస్తుంటే వద్దని ఎంతగా నచ్చచెప్పాలని తల్లి ఆరాటపడుతుందో, మంచిదానిని ఇవ్వడానికి ఎంతగా ప్రయత్నిస్తుందో అలాగే మహాత్ములుకూడా మన శ్రేయస్సుకోసం పాటుపడుతూనే వుంటారు. కానీ మనమే ఇది శాశ్వతమని భ్రమించి అశాంతిలో ఇంకా ఇంకా కూరుకుపోతుంటాము. కానీ తల్లివలెనే మహాత్ములుకూడా వాళ్ళ ప్రయత్నం వారు మానుకోరు. అలాంటివారే పూజ్యశ్రీ మాస్టరుగారు.

మనం శాంతిని ఎలా పొందాలోనన్నదానికి పూజ్యశ్రీ మాస్టరుగారి జీవితమే ఉదాహరణ. ఆయన తమ జీవితంలో చిన్నప్పుడే ఎన్నో కష్టాలను అనుభవించారు. ఈ దుఃఖవిముక్తికి మార్గాన్ని తీవ్ర అన్వేషణతో, తీవ్ర సాధనచేసి కనుగొన్నారు. తరువాత సాయినాథుని అనుగ్రహం పొందాక తాను పొందిన శాంతిని అందరికీ తెలియజేయాలన్న తపనతో ప్రచార కార్యక్రమం చేపట్టారు. నిజమైన ఆధ్యాత్మికత ఎలా వుంటుందో, నిజమైన మహాత్ములు ఎలా వుంటారో తెలియజెప్పడానికి తమ శాయశక్తులా ఉద్యమించారు. ఆ ప్రయత్నంలో ఆయన నకిలీ ఆధ్యాత్మికతవైపు నుంచి, పచ్చి లౌకికులవైపు నుంచీ గూడ అనేక విధాలుగా ప్రతిఘటనలను ఎదుర్కొన్నారు. అంతేగాక ఆర్థిక సమస్యలు, ఆధ్యాత్మిక సమస్యలు కుటుంబ సమస్యలు, సామాజిక సమస్యలు – ఎన్నింటినో వారెదుర్కొన్నారు. అయినా ఎప్పుడూ ఆయన ధైర్యాన్ని, ఆత్మవిశ్వాసాన్ని కోల్పోలేదు. తాను నమ్మిన సత్యం పట్ల, నమ్ముకున్న సాయినాథుని పట్ల విశ్వాసాన్ని విడనాడలేదు. తన కర్తవ్యాన్ని తాను నిర్వర్తించుకుంటూ తన మార్గాన తను ముందుకు నడిచారు. తనను గురువుగా, గొప్ప ఆధ్యాత్మిక వేత్తగా కొందరు ప్రశంసించినా, మరొక విధంగా నిరసించినా ఆయన పొంగక, కృంగక ఒకేవిధంగా వున్నారు. భగవంతుని పట్ల విశ్వాసమన్నా, కర్మ సిద్ధాంతం పట్ల విశ్వాసమన్నా అదే. ఆయనకు వంతెన మీద ఇల్లు కట్టుకోవాలనుకోవడం ఎంతటి తెలివితక్కువతనమో తెలుసు. అందుకే ఆయన వంతెనను దాటి ఆవలి తీరానికి చేరారు. అంతులేని ప్రశాంతతను, ఆనందాన్ని అనుభవించారు. దానిని అందరికీ పంచాలని ప్రయత్నించారు. అందుకే మనము ఆయననే ఆదర్శంగా తీసుకోవచ్చు, తీసుకోవాలి కూడా. మాటలు చెప్పడం సులభం, ఆచరించడమే కష్టం. అయినా ఈ దుఃఖ సాగరాన్ని దాటాలంటే ఆచరించక తప్పదు.

ఆయన మన మంచి కోసం చెప్పని విషయం లేదు, చేయని ప్రయత్నమూ లేదు. అశాంతికి దూరమవడానికి వచ్చే అవరోధాలను ఎలా తొలగించుకోవాలో చెప్పడమేగాక, శాంతిని పొందే మార్గాలు కూడా ఎన్నో తెలియజేశారు. వాటిలో ఒకటి 'వంతెన మీద ఎవరూ ఇల్లు కట్టుకోరు' అన్న సూక్తి. ఆయన చెప్పిన ఈ సూక్తిలో ఎన్నెన్ని అర్థాలున్నాయో! "ఈ ప్రపంచమంతా నశించిపోయేదే. ఏదీ ఇక్కడ నిలువదు. మరి నువ్వెందుకు నిలుస్తావని అనుకుంటున్నావు? ఇక్కడ ఎన్ని జన్మలెత్తినా, శాంతి కోసం వెంపర్లాడుతూ అశాంతితో ఘర్షవలసినదే. ఎన్ని జన్మలెత్తినా అశాంతే వున్నప్పుడు ఎన్ని జన్మలైనా ఎత్తాలని ఎందుకు కోరుకుంటున్నావు? శాశ్వతానందాన్ని పొందాలని ఎందుకు అనుకోవడం లేదు? ఎండమావులను చూసి నీళ్ళని భ్రమపడుతూ దానివల్ల దాహం తీరాలని ఎందుకు పరుగులిడతావు? ఇదిగో చూడు! నిన్ను ఈ దుఃఖసాగరం నుంచి దాటించడానికి సాయిసమర్థులు సిద్ధంగా వున్నారు. ఆయనను పట్టుకుని ఈ వంతెనను దాటిపో. అపారమైన శాంతిని పొందు" అని ఆయన ఉద్బోధిస్తున్నారు.

ఇక ఆలస్యమెందుకు? పూజ్యశ్రీ మాస్టరుగారి 75వ జన్మదిన కృతజ్ఞతా మహోత్సవ సందర్భంగా మనం ఈ రాగద్వేషాదుల వలయం నుండి తప్పుకునే ప్రయత్నం చేద్దాం. వాటికి వచ్చే అవరోధాలనుంచి పూజ్యశ్రీ మాస్టరుగారు ఏమి చెప్పారో వారి గ్రంథాల పారాయణ ద్వారా, ప్రవచనాలద్వారా తెలుసుకుని ఆచరించడానికి ప్రయత్నిద్దాం. ఈ వంతెనను దాటే ప్రయత్నం చేద్దాం. అట్టి సంకల్పాన్ని దృఢంగా నిలుపుకోవడంకన్నా ఆయనకు మనం చెప్పుకునే కృతజ్ఞత మరేమున్నది? •

(గత సంచిక తరువాయి)

# సిద్ధయ్య

**శ్రీమతి శ్రీదేవి**

పరుగు పరుగున కందిమల్లయ్యపల్లెకు చేరుకున్నారు ఆదంబీ, ఫీర్ సాహెబ్. ఎంతో ఆత్రుతతో శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామివారి ఆశ్రమం చేరుకున్నారు. ఈసారి సిద్ధయ్యను వలె వీరికి ఆశ్రమంలో ప్రవేశానికి ఎవరూ అడ్డురాలేదు. నేరుగా వారు ఆశ్రమం లోపల ఆసీనులై వున్న స్వామివారిని దర్శించి అభివాదం చేశారు. వారి సన్నిధిలోనే కనిపించిన సిద్ధయ్యను చూసిన వారి హృదయంలో దుఃఖం పెల్లుబికింది.

"నాయనా! సిద్ధా! ఇక్కడున్నావా? నీ కోసం వెదకి వెదకి ఎంతగా అల్లాడిపోయామో తెలుసా?" అంటూ కొడుకుని కౌగలించుకొని పెద్దగా ఏడ్చింది ఆదంబీ.

"ఎన్నాళ్ళయింది నిన్ను చూసి! ఎలా వున్నావు బేటా?" అన్నాడు ఫీర్ సాహెబ్ కన్నీళ్ళతో. వారి ఆవేదన చూసిన వీరబ్రహ్మేంద్రస్వామి అనునయంగా

"అమ్మా! శాంతించండి. మీ బిడ్డ యిక్కడ క్షేమంగా వున్నాడు. ముందు మీరు విశ్రాంతిగా కూర్చోండి" అన్నారు. ఎంతో దూరం నుండి వచ్చిన వాళ్ళని ఓదార్చి ఆహార పానీయాలంద జేశారు స్వామి వారు.

తదుపరి వారు స్వామితో యిలా అన్నారు –

సాహెబ్ : స్వామీ! మీకు సలాం. మీ ఆదరణకు సలాం. మా బేటా యిక్కడికి ఎప్పుడొచ్చాడు? ఎందుకొచ్చాడు? స్వామీ! సెలవీయండి.

స్వామి : ఋణానుబంధం అనేది వుంటుంది కదా! అది లేకుంటే ఎక్కడికెలా రాగలరు నాయనా! ఇక ఎందుకొచ్చాడో అనేది మీరే అతనిని అడగండి.

ఆదంబీ : సిద్ధా! ఇక్కడికి ఎందుకు వచ్చావు? కారణమేమిటి బేటా?

సిద్ధయ్య : నా గురువర్యులు శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామివారే అని అల్లా దయవల్ల గుర్తించాను. సకల మతాలసారం వీరే. వీరే నా దైవం. వారిని దర్శించాలన్న బలమైన కోరికయే నన్నిక్కడకు రప్పించింది.

సాహెబ్ : అరే! ఏమి మాట్లాడుతున్నావ్? మనం ముసల్మానులం స్వామి హిందూ మత గురువులు. వారు నీకు గురువేమిటి బేటా?

సిద్ధయ్య: తండ్రీ! భగవంతుడికి కులమత భేదాలు లేవు. స్వామివారు మత భేదాలెంచరు. దయామయులయిన శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి మోక్షమార్గం వైపు నడవాలనుకొన్న ప్రతివారిని ఆదరించి, దారి చూపి నడిపిస్తారు.

సాహెబ్ : అల్లాయే మన గురువు. మనం మన ఇస్లాంని పాటించాలి. ఎంతోమంది దేవతలు, గురువులు వున్న హిందూమతం మనకెందుకు బేటా?

సిద్ధయ్య: ఒక్క దేముడే అన్ని రూపాలలో వచ్చాడని అంటారు హిందువులు. ఒక తల్లికి పుట్టిన బిడ్డలలోనే ఒకరికి మరొకరికి ఎంతో భేదముంటుంది. ఒక బిడ్డకు పులుపు, మరొకబిడ్డకు తీపి, మరొకరికి కారం యిలా వేర్వేరు రుచులున్న బిడ్డలకు ఎవరికిష్టమయిన రీతిలో వారికి ఆహారమందించి సంతృప్తులను చేస్తుంది తల్లి. అలాగే భక్తుల అనురక్తి ననుసరించి, వివిధ రూపాలలో వారికి దర్శనమిస్తాడు భగవంతుడు. ఆ కారణంగానే అన్ని రూపాలు, అవతారాలు! అంతే. ఏ మతమైనా ముక్తిమార్గానికి త్రోవ చూపించేదే కదా, తండ్రీ!

సాహెబ్: అవును బేటా! అందుకే

మన అల్లా మనకు ముక్తి మార్గం చూపిస్తాడు. ఇస్లాంనే నమ్మి జీవిద్దాం. స్వామివారి వద్ద సెలవు తీసుకొని మన యింటికి వెళ్దాం పద బేటా.

సిద్దయ్య : తండ్రీ స్వామి వారి పాదాలకు నా మనస్సు అంకితమైపోయింది. నా గురుదేవులను వదలి నేను రాలేను. నన్ను క్షమించండి.

ఆదంబీ : నాయనా! లేక లేక పుట్టిన ఒక్కగానొక్క బిడ్డవు. నీపైననే ప్రాణాలన్నీ పెట్టుకొని జీవిస్తున్నాను. కన్నతల్లి మనసు ఎంతగా కష్టపడుతుందో అర్థం చేసుకోలేవా?

సిద్ధయ్య: అమ్మా! నీ ప్రేమను నేను అర్థం చేసుకొనగలను. ఒక్క బిడ్డకు తల్లివైన నీకే యింత ప్రేమ వుంటే సకల లోకాలనూ పాలిస్తున్న ఆ తండ్రికి ఎంత ప్రేమ వుంటుందో కదా! అమ్మా మీరు, నేను, మనందరమూ ఈ ప్రేమమూర్తి శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామినే ఆశ్రయిద్దాం. స్వామి నీడలో నేను సంతోషంగా వుంటాను. మీరు కూడా సంతోషంగా వుండండి.

చేతులు జోడించి తల్లిదండ్రులను కన్నీటితో వేడుకొన్నాడు సిద్ధుడు.

★★★

ఒకానొక సమయంలో పరిపూర్ణాచార్యులు, ప్రకృతాంబ అనే పుణ్యదంపతులు తీర్థయాత్రలు చేస్తూ ఒక నదీసమీపంలో ప్రయాణం చేస్తుండగా గర్భవతి అయిన ప్రకృతాంబకు పురిటి నొప్పులు ఆరంభమై మగబిడ్డను ప్రసవిస్తుంది. ఆ సమయంలో దురదృష్టవశాత్తు నదీస్నానం చేస్తూ కాలుజారి నదిలో పడి మరణిస్తాడు భర్త. ప్రకృతాంబ దుఃఖాన్ని భరించలేక ప్రాణాలు విడుస్తుంది. ఒంటరి వాడైన ఆ పసికందును ఒక తపస్వి చేరదీసి 'వీరబ్రహ్మము' అని నామకరణం చేసి పెంచుతుంటాడు. కొన్నాళ్ళకు సంతానం లేని వీరభోజయాచార్యులు, వీరపాపమాంబ అనే దంపతులకు ఆ బిడ్డను అప్పగించి, దైవప్రసాదంగా భావించి ఆ బిడ్డను పెంచుకొనవలసిందిగా ఆదేశిస్తాడు. పెరిగి పెద్దవాడైన వీరబ్రహ్మము ఒకనాడు తల్లి వీరపాపమాంబతో తాను లోకానుగ్రహార్థం దేశసంచారం చేయవలసివుందని, అనుబంధాలకు, బాంధవ్యాలకు అతీతుడనై ప్రజలందరికీ ముక్తిమార్గాన్ని బోధిస్తూ తత్త్వబోధలు చేయవలసిన కర్తవ్యం తన ఎదుటవున్నదని యిల్లువదలి వెళ్ళేందుకు అనుమతించమని ప్రార్థిస్తారు. తనను విడచి వెళ్ళవద్దని దుఃఖిస్తున్న తల్లిని ఊరడించి, తత్త్వబోధ గావించి ఆమెను శాంతింపజేస్తాడు వీరబ్రహ్మం. అతని మహాత్యాన్ని అర్థం చేసుకున్న వీరపాపమాంబ అతని అవతార కార్యానికి తాను అడ్డు రాకూడదని భావించి సంతోషంగా అతనిని సాగనంపుతుంది. ఆ అవతార పురుషుడు శ్రీవీరబ్రహ్మేంద్రస్వామి యింటి నుండి బయలుదేరి పాదచారియై సంచరిస్తూ ఆంధ్రదేశంలోని, కర్నూలు జిల్లా బనగానపల్లె పట్టణాన్ని చేరుకుంటారు. బనగానపల్లె పట్టణం లోని గరిమిరెడ్డి అచ్చమ్మగారి యింటి అరుగుపై ఆ రాత్రి విశ్రమిస్తాడు శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి. గరిమిరెడ్డి అచ్చమ్మది అత్యంత సంపన్న కుటుంబం. సాధుసత్పురుషులను సేవిస్తూ, పేదసాదలనాదరిస్తూ, ధర్మనిరతి, దైవచింతనలతో జీవనం సాగించే అచ్చమ్మ ఉత్తమ సాధ్వి. అడిగిన వారికి లేదనకుండా సహాయపడే గొప్ప దానశీలి.

గరిమిరెడ్డి అచ్చమ్మ ఉదయాన్నే వాకిలి తలుపు తెరచి వీధి అరుగుపై వున్న వీరబ్రహ్మేంద్ర స్వామిని చూచి ప్రశ్నించగా, తాను ఎవరూలేని ఒంటరివాడననీ జీవనోపాధి కోసం వచ్చానని చెప్పిన ఆయనకు ఆవులు కాచే పనిని అప్పగిస్తుంది అచ్చమ్మ. ఆ సమయంలో ఆయన దివ్యత్వాన్ని గుర్తించిన అచ్చమ్మ గ్రుడ్డివాడైన తన కుమారుని కరుణించమని ప్రార్థిస్తుంది. ఆయన ఆ పిల్లవాడికి దృష్టిని ప్రసాదించి దీవిస్తారు. ఆ రోజుల్లోనే బనగాన పల్లె సమీపంలోని రవ్వల కొండగుహలో కూర్చొని కాలజ్ఞానాన్ని రచించి ప్రజలకు తత్త్వబోధలు చేస్తూ కొంతకాలం తర్వాత బనగానపల్లెను వీడి కందిమల్లయపల్లె చేరుకున్నారు శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి.

కందిమల్లయపల్లెలో వడ్రంగి పనిని వృత్తిగా ఎంచుకుని జీవించసాగారు శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి. ఆరోజుల్లోనే స్వామి మహిమలు ఎన్నో వెల్లడి కావటంతో ప్రజలు ఆయనను భగవదవతారంగా భావించసాగారు. కొన్నాళ్ళకు స్వామి ఆ వూరి వాస్తవ్యురాలయిన గోవిందమ్మ అను యోగ్యురాలైన కన్యను వివాహమాడి గృహస్థాశ్రమాన్ని స్వీకరిస్తారు. ఆ దంపతులకు నలుగురు కుమారులు, ఒక కుమార్తె జన్మిస్తారు.

ఒకసారి కందిమల్లయపల్లె గ్రామంలో మశూచిక వ్యాధి వ్యాపిస్తుంది. ఊరి ప్రజలంతా పోలేరమ్మ గుడిలో పూజలు చేస్తూ ఆ గ్రామ దేవతకు 'చలిది అన్నం'('ఉప్పు కూడా వేయని పెరుగన్నం) వండి

***మిగతా 21వ పేజీలో***

# వార్తాలాపము

(గత సంచిక తరువాయి)

**శ్రీమతి అడిదం వేదవతి**

*శ్రీ ప్రకాశానంద స్వామివారిచే విరచితమైన వార్తాలాపమనే యీ గ్రంథము గ్రాంథికభాషలో వ్రాయబడి వుండటం వలన తమకు అర్థంగావడం లేదని చాలామంది పాఠకులు అభిప్రాయాన్ని వ్యక్తపరిచారు. అందుకని పాఠకుల అభ్యర్థన మేరకు పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజగారి ప్రియపుత్రిక శ్రీమతి అడిదం వేదవతిగారు సరళమైన భాషలో ఈ గ్రంథాన్ని పాఠకులకు అందజేస్తున్నారు - ఎడిటర్.*

## ఎనిమిదవ ప్రసంగము

### గురుద్రోహి జూడాసు

ఈ ఉపదేశాలను విని మతాచార్యులు, నాయకులు భవనంలో సమావేశమై ఏదో విధంగా జీససు ప్రాణాలను తీయాలని భావించారు. వారు జీససు యొక్క పన్నెండు మంది శిష్యులలో నుండి జుడాసు అనే శిష్యుని వెతికారు. గురుద్రోహి అయిన జుడాసు ఇలా అన్నాడు - "నేను జీససును మీకు అప్పగించినట్లైతే మీరు నాకేమి ఇస్తారు?" ముప్పై వెండి నాణాలకు బేరం జరిగింది. జూడాసు మతాచార్యులతో ఇలా అన్నాడు -"నేను సైగచేసి జీససు ఎవరో సూచిస్తాను. మీరు పట్టుకోండి. జూడాసు జీససు దగ్గరకు వచ్చి 'మహాప్రభూ' అని ఆయన చేతిని తీసుకుని ముద్దుపెట్టుకున్నాడు.

వెంటనే మతాచార్యుల మనుషులు జీససును పట్టుకొని బైటకు తీసుకుని వెళ్ళారు. జనసమూహం నుండి ఒకరు కత్తిని బయటకు లాగాడు. ఇది చూసి జీససు ఇలా అన్నాడు - "ఓ స్నేహితుడా! కత్తిని ఒరలో వుంచు. కత్తిని చేతబట్టినవాడు కత్తితోనే చనిపోతాడు". మతాచార్యులు జీససుకు వ్యతిరేకంగా చెప్పడానికి అబద్ధసాక్ష్యాలను సిద్ధం చేయడానికి ప్రయత్నించారు. కానీ ఎవరూ ముందుకు రాలేదు.

ప్రధానాచార్యులు ఇలా అడిగారు - "దేవుడి మీద ఒట్టేసి చెప్పు. నువ్వు దేవుడి కుమారుడివైన క్రీస్తువేనా?" జీససు ఇలా అన్నాడు - "మీరే అంటున్నారు కదా?" మతాచార్యులకు ఈ సమాధానం చాలు. వెంటనే వారు జీససుకు మరణదండన విధించాలని నిర్ణయించారు. మతాచార్యులు జీససును ఇతర మతాచార్యుల ఎదుట నిలబెట్టారు. ఇంతలో జూడాసుకు పశ్చాత్తాపము కలిగి ముప్పై వెండినాణాలను మతాచార్యునికి తిరిగి ఇచ్చివేశాడు. అతడిలా అన్నాడు - "నేను నిర్దోషి అయిన వ్యక్తిని మోసగించాను. పాపము చేశాను". అతనికి మతాచార్యులిలా సమాధానం చెప్పారు. "మాకేమి? నీ సంగతి నీకే తెలియాలి!" జూడాసు తరువాత

పశ్చాత్తాపంతో ఆత్మహత్య చేసుకున్నాడు.

## కొరతపై క్రీస్తు

గవర్నరు జీససును అడిగాడు – "నీవు యూదుల రాజువా?"

జీసస్ : "నీవే అంటున్నావు కదా!"

అప్పుడు మతాచార్యులు జీసస్ మీద నేరాలను మోపారు. జీసస్ మౌనం వహించాడు. గవర్నరుకు చాలా ఆశ్చర్యం కలిగింది. అతడు ప్రజలనుద్దేశించి ఇలా అన్నాడు – "ఈ క్రీస్తు అనబడే జీససును నేను ఏమి చేయాలి?" అప్పుడు మతాచార్యులు ప్రజలను తమవైపు త్రిప్పుకోడానికి ధనాన్ని విరజిమ్మసాగారు. అది తీసుకుని ప్రజలు జవాబిచ్చారు – "కొరత వేయండి!"

గవర్నరు ఇలా అన్నాడు – "నిర్దోషి రక్తంతో నేను తప్పు చేయలేను. మీ ఇష్టం వచ్చినట్లే చేయండి!" అప్పుడు ప్రజలందరూ ఇలా అన్నారు – "ఆయన రక్తము మా మీదను, మా సంతానాల మీద పడుగాక". ఆ తరువాత సైనికులు అతనికి పాతబట్టలు కట్టి, ముళ్ళ కిరీటము పెట్టి, "యూదులరాజా! మోకాళ్ళ మీద కూర్చుని నమస్కారం చేయి!" అని వేళాకోళం చేశారు. జీససును చంపే ప్రదేశానికి తీసుకెళ్ళి మేకు నాటారు. ఆ సమయంలో అక్కడి నుండి వెళ్ళిపోతున్న వారు కొందరు ఇలా అన్నారు – "మందిరాన్ని కూలగొట్టి మూడు రోజులలో కొత్తది కట్టాలనే ఉద్దేశంగల జనులారా! మీ జాతిని రక్షించుకోండి!"

ప్రధానాచార్యుడు ఇలా పరిహాసం చేశాడు – "ఇతరులను రక్షించగలవాడు తన జాతిని రక్షించలేడా? నీకు దేవుడి మీద నమ్మకం లేదా? నీవు దేవుడి కుమారుడివైతే దేవుడు నిన్నెందుకు రక్షించడం లేదు?" ఇలా అంటూ ప్రధానాచార్యుడు ఆజ్ఞాపించాడు – "ధర్మాన్ని రక్షించడం కోసం జీససును వెంటనే చంపివేయండి!" అప్పుడు జీసస్ శరీరము కొరతపైన కట్టి చేతులు, కాళ్ళు, వక్షము – ఈ చోట్ల మేకులు నాటబడ్డాయి. ఇది రాక్షసప్రకృతి.

## అసుర ప్రకృతి

అసుర ప్రకృతి మీద ఈ విరోచనోపాఖ్యానము వినండి –

అసుర ప్రకృతి అంటే శరీరమే ఆత్మ అని విశ్వసించి భోగవిలాస తత్పరులవడము.

విరోచనుడు, ఇంద్రుడు ప్రజాపతి దగ్గరకు ఉపదేశానికి వెళ్ళారు. ప్రజాపతి వారికి ఆత్మానుభూతి కలుగజేయడానికి ఇలా అన్నాడు – అందమైన వస్త్రాలు, ఆభరణాలతో అలంకరించుకుని నీటి పాత్రలో చూడండి. అప్పుడు వారు అలా అలంకరించుకుని నీటిపాత్రలోకి చూశారు. ప్రజాపతి, "ఏమి చూస్తున్నారు?" అని అడిగాడు. ఇలా అడగడంలో ఆయన ఉద్దేశమిది – "ప్రతిబింబములో చూసేవన్నీ శరీరంతో వున్న సంబంధం వలన వచ్చినవే. ఉదాహరణకు ఆ ఆభరణాలు మొ॥నవన్నీ మధ్యలో వచ్చినవే (అంటే ఆగంతుకాలే). ఇలానే జుట్టు, గోళ్ళు కూడాను. ఇలానే శరీరం కూడా ఆగంతుకమే (అంటే మధ్యలో వచ్చినదే) అని దాని ఆగమాపాయిత్వాన్ని (అంటే అది ఎలా సంభవిస్తుందో) తెలిసికొంటే వీరికి ఆత్మానాత్మజ్ఞానము కలుగుతుంది అని. కానీ వారిద్దరికీ ప్రజాపతి ఉద్దేశానికి విరుద్ధంగా విపరీతజ్ఞానము (అవసరమైన జ్ఞానము) కలిగింది. ఆ ఉపదేశానికి ఆనందించి వారిలా అన్నారు – "స్వామీ! మేమిద్దరమూ చక్కగా అలంకరణ చేసుకున్న శరీరాన్ని నీటిలో చూస్తున్నాము. ఈ అందమైన వస్త్రాలతో, ఆభరణాలతో అలంకరింపబడిన శరీరమే బ్రహ్మము అని తెలిసికొన్నాము. ఇది అమృతము, అభయము" ఇలా చెప్పి ఆనందించి వెళ్ళిపోయారు.

ఇంద్రుడు బుద్ధిమంతుడు. అతడు నేరుగా దేవతల దగ్గరకు వెళ్ళలేదు. అతడు ఏకాంతంగా మననం చేశాడు. ప్రజాపతి దగ్గరకు అనేకసార్లు వెళ్ళి చివరకు ఆత్మజ్ఞానం పొందాడు. విరోచనుడు జడుడు. అతడు తన రాజ్యానికి వెళ్ళి తన అసుర ప్రజానీకానికి ఇంకా ఎక్కువ విషయభోగాలను అనుభవించమని చెప్పాడు. అతడింకా ఇలా అన్నాడు –

"నేను బ్రహ్మ దగ్గరకు వెళ్ళి ఈ ఉపదేశాన్ని పొందాను – శరీరమే ఆత్మ 'ఆత్మైవేహ మహయ్యః, ఆత్మా పరిచర్యః' – 'శరీరరూపమైన ఆత్మే పూజింపదగినది, శరీరరూపమైన ఆత్మే సేవించదగినది. భోగవిలాసాలలో మునిగి అన్ని రకాల ఆనందాలనూ అనుభవించండి. చచ్చాక ఏమీ లేదు.

'ఇమం చాముం చేతి' – 'ఈ లోకము, పరలోకము కూడ మీదే!'

పరలోకాన్ని అంగీకరించని చార్వాకులు కూడా చనిపోయినతరువాతశ్మశానయాత్రలోశవాన్నిపల్లకీలోపెట్టి

విలువైన వస్త్రాలు, పూలమాలలు, అగరుధూపము, అత్తరులు మొ॥న వాటితోనూ ఢంకా, దుందుభి (డోలు, సన్నాయి మొ॥నవి) మొ॥న వాద్యాలతోనూ ఎంతో అట్టహాసంతో, సంగీతము, పూజ మొ॥న కార్యక్రమాలతో తీసుకుని వెళతారు. వారి స్మారకచిహ్నాలుగా పెద్ద పెద్ద శిల్పాలనో, భవనాలనో నిర్మించడం కూడా గౌరవమని తలుస్తారు. శవానికి వారు చూపే గౌరవము, వైభవము పరలోకంలో కలుగుతుందని నమ్ముతారు."

పై బోధ చేసిన తరువాత విరోచనుడు పెద్ద పెద్ద భవనాలు నిర్మించాడు. అనేక రకాలైన విలాసోపకరణాలను అనుభవించడానికి తెప్పించాడు. తాను కుర్చోడానికి రత్నాలతో పొదగబడిన సింహాసనాన్ని తయారు చేయించాడు. వజ్రవైఢూర్యాలను ధరించాడు. విహారానికి వెళ్ళే సమయంలో సేనాధిపతులు అతనికి రత్నఖచితమైన పల్లకీ, రత్నఖచితమైన అంబారీ, ఢంకా మొ॥న వాద్యాలను ఏర్పాటు చేశారు. 'మహారాజాధి రాజ', 'సార్వభౌమాధిపతి' మొ॥న బిరుదులను పొంది నౌకరులతో పిలిపించుకునేవాడు ఇతరులకు కూడా వారి వారికి తగినట్లు రాజరత్న, రాజభూషణ మొ॥న బిరుదులను ఇచ్చాడు. సంవత్సరంలో కొన్ని ప్రత్యేక దినాలలో ఆర్భాటంగా వాహనం మీద బయలుదేరి ప్రజల పూజలను అందుకునేవాడు.

అసురులు తమకు లభించిన భోగాలతో వేశ్యల నృత్యాలలోనూ, పాటలలోనూ నిమగ్నులయ్యారు. అందరూ కలిసి వనభోజనాలు చేసుకుని అనేక రకాల రుచికరములైన అన్న పానీయాలను ఆస్వాదించారు. అసురాధిపతి అయిన విరోచనుడు కలిగించిన దేహాత్మభావాన్ని, భోగవిలాస జీవితాన్ని, సేవలను, పూజలను అందుకునే విద్య కూడా వంశపారంపర్యంగా రాజులను సంక్రమించింది.

వారి నుండి తెలిసో, తెలియకో ఈ వైఖరి ధనవంతులలో ప్రవేశించింది. ధనవంతులు తమ శరీరపోషణే ముఖ్యమని విలాసాలలో మునిగిపోయారు. కాబట్టే పెళ్ళి మొ॥న శుభసమయాలలో వేశ్యల నృత్యాన్ని, ప్రదర్శనలను, గీతాలను ఏర్పాటు చేస్తారు. ఆ తరువాత అనేకమందిని అవినీతికరములైన వాసనలతో కూడిన కార్యాలకు పురిగొల్పుతారు.

ఈ అనర్థ పరంపర ఇంతటితో ఆగలేదు. ఈమధ్య రాజులలోనూ, ధనవంతులలోనూ ఈ శరీరపూజ మితిమీరిపోయింది. తీర్థాలలోనూ, పుణ్యక్షేత్రాలలోనూ, మఠాలలోనూ, ఆశ్రమాలలోనూ ఈ వైఖరి ఎక్కువగా వున్నది. గురువులు, మఠాచార్యులు, సన్యాసులు, త్యాగులు సంసార సుఖాలను మరిగి ఆత్మప్రాప్తికి బదులు తమ కలుషితమైన ఆచరణ మార్గాన్ని అమాయక ప్రజలనెత్తిన రుద్ది వారిని వలలో చిక్కించుకుంటున్నారు. వారిలో కూడా ఈ అసురస్వభావము ఎక్కువగా వున్నది. వారు లోకులు ఏమనుకుంటారో అనే భయంతో మాత్రమే వేశ్యల నృత్యగీతాలను అనుభవించరు. మిగిలిన అన్ని భోగవిలాసాలకూ వెనుకాడరు. ఛత్రము, చామరము, దండము, ఢంకా, దుందుభి, పాలకి, పాదుకలు వుంటాయి. ఏమి చెప్పను? బంగారాన్ని తాకినంతమాత్రానే ప్రాయశ్చిత్తము చేసుకోవాలని ఋషుల ధర్మం వుంటే, బంగారపు సింహాసనం మీద కూర్చుని తమ శరీరానికి ఇతర భక్తుల చేత పూజలు చేయిస్తారు. పాదపూజలు చేయించుకుని శిష్య, ప్రశిష్యుల ద్వారా ఉపదేశాలు చేయిస్తారు. రాజులు వాహనాలు ఎక్కి బయటకు వెళ్ళినట్లు వారు కూడా వాహనాలనెక్కి బయటకు వస్తారు. వారు రాజులకు రాజులు. కాబట్టి వారి రాజవైభవము వుంటే వుండనివ్వండి. కానీ వారు ప్రజలను మభ్యపెట్టడానికి ఇలా అంటారు – "ఇవన్నీ మా మఠానికి శోభ కలిగించడానికే! మాకు ఎటువంటి వైభవమూ అక్కరలేదు. ఫలానా సాంప్రదాయాలను చూడండి. వారు ఎంత సేవ చేయించుకుంటున్నారో! ఎటువంటి ఊరేగింపుతో బయటకు వస్తారో! నీ ధర్మమేమి తక్కువైనదా? నీ మతం ఆ మతం కంటే గొప్పది. మీ శక్తి వారి శక్తి కంటే ఎక్కువ. వారు వారి గురువుకు చేసిన సేవకంటే మీరు మీ గురువుకు ఎక్కువ సేవ చేయాలి. మహావైభవోపేతంగా ఊరేగింపు జరపాలి. లేకపోతే మీ సాంప్రదాయానికి హాని కలుగుతుంది. ఇలానే రాజుల ఊరేగింపు జరిగినపుడు నగరమంతా అలంకరింపబడుతుంది. రాజమార్గాలన్నీ జండాలతోనూ, తోరణాలతోనూ ప్రకాశిస్తూ వుంటాయి. కర్రలతో ద్వారాలను తయారు చేసి రకరకాల అలంకరణలు చేస్తారు. ధనవంతులు కూడా వివాహాలలో ఇలాగే అలంకరణలు చేస్తారు. మేము (మఠగురువులు) రాజులకే రాజులము (గురువులము)! కాబట్టి మాకు కూడా ఇలానే ప్రకాశవంతమైన అలంకరింపబడిన వస్త్రభూషణాదులు, వైభవాలు ఉండాలి."

***మిగతా 18వ పేజీలో***

# మాతృదేవి స్మృతులు

**శ్రీమతి సరోజని జాలారావు**

శ్రీమతి సరోజని జాలారావుగారు మాతృశ్రీ అలివేలుమంగమ్మ తల్లి స్మృతులను ఈ విధంగా తెలియచేస్తున్నారు:

పూజ్యశ్రీ మాస్టరుగారు శరీరంతో వున్నప్పుడు, పూజ్యశ్రీ అమ్మగారిని మేము అంటే సత్సంగ సభ్యులెవ్వరు చూడలేదు. సత్సంగానికి రావడం మాస్టరుగారిని దర్శించుకోవడం వెళ్లిపోవడం జరిగేది. ఒక్కసారి మాత్రం......ఒక భక్తుడికి పూజ్యశ్రీ మాస్టరుగారు ఏకముఖి రుద్రాక్ష, తిరుపతిలో ఇచ్చారట. (తిరుపతిలో అతనికి దర్శనమిచ్చి రుద్రాక్ష ప్రసాదించిన సమయంలో పూజ్యశ్రీ మాస్టరుగారు ఒంగోలులోనే వున్నారట!! ఆ సంగతి తరువాత తెలిసింది!) అతను పూజ్యశ్రీ మాస్టరుగారి దగ్గరికి వచ్చినప్పుడు, ఆ రుద్రాక్షని అమ్మగారికి చూపించమని నన్ను లోపలి పంపించారు. అప్పుడు మొదటిసారి పూజ్యశ్రీ అమ్మగారిని చూసాను! మళ్ళీ మాస్టరుగారు సమాధి అయిన తరువాతే చూడటం జరిగింది.

పూజ్యశ్రీ మాస్టరుగారి సమాధి అనంతరం, నేను మావారు, ప్రతిరోజూ మాస్టరుగారి సమాధికి సేవ చేసుకునేవాళ్లం. కానీ మా మనసులో మాత్రం ఇప్పుడు మనల్ని ఎవ్వరు నడిపిస్తారు? మళ్ళీ అంతటి ప్రేమమూర్తి ఎక్కడ దొరుకుతారు? అని చాలా బాధ పడుతుండేవాళ్ళం! ఒకళ్ళిద్దరిని మహాత్ములనుకుని కలుసుకున్నాము. కానీ నచ్చక తిరిగి వచ్చేసాము. పూజ్యశ్రీ మాస్టరుగారు నా చేత సత్సంగాలు చేయించేవారు. మా ఇంట్లో కూడా ప్రతి సోమవారం సత్సంగం చేసుకునేవాళ్లం. కొన్నాళ్ళకి పూజ్యశ్రీ అమ్మగారు వారి ఇంట్లో గురువారం సత్సంగం చేసుకొమ్మని నాకు కబురు చేశారు. ఇంక అప్పటినుంచి అమ్మగారితో సాంగత్యం ప్రారంభమయ్యింది. వారానికి ఒక రోజల్లా పోయి, రోజూ పూజ్యశ్రీ అమ్మగారి ఇంటికి వెడుతూ వుండేవాళ్ళం. పూజ్యశ్రీ అమ్మగారి ప్రేమాదరణలతో మాస్టరుగారు లేరే అన్న బాధ కొంచెం కొంచెం పలచబడసాగింది. ఇలా రోజులు గడుస్తుండగా పూజ్యశ్రీ మాస్టరుగారి ఇల్లు కట్టడం పూర్తయ్యింది. ఒక శుభ ముహూర్తంలో పూజ్యశ్రీ అమ్మగారు, బాబుగారు, వేదమ్మ, కొద్దిమంది బంధువులు, మరికొద్దిమంది సత్సంగసభ్యులతో ఇంటి గృహప్రవేశం జరిగింది. అయితే నాకు, అమ్మగారు కొత్త ఇంటికి మారుతుంటే, కొంచం బాధ అనిపించింది, ఎందుకంటే ఇప్పుడు ఉన్న ఇంట్లోనే పూజ్యశ్రీ మాస్టర్ గారితో అనుబంధం, ఇక్కడే సమాధి అవ్వడం,,,,ఇవన్నీ జరగడం వల్ల, మాస్టరుగారు ఇక్కడే వున్నారన్న భావన ఎక్కువగా వుండేది. కొత్త ఇంట్లో అలాగ అనిపించదేమో అనుకునేదాన్ని. ఒకరోజు పూజ్యశ్రీ మాస్టరుగారు కొత్త ఇంట్లో కూర్చుని వున్నట్లు, నేను వెళ్లి నమస్కారం చేసుకుంటే, నా తల మీద చెయ్యి పెట్టి దీవించినట్టు కల వచ్చింది, వారి చేతి స్పర్శ చాలా రోజులవరకు అనుభవమౌతూ వుండేది. ఆ తర్వాత వారి ఆ కొత్త ఇంట్లోకూడా చాలా ఆనందంగా వుండేది.

కొన్నిరోజులకు కావలి డాక్టరు గారు, పూజ్యశ్రీ మాస్టరుగారి విగ్రహం చేయించి తెచ్చారు. సత్సంగ సభ్యులందరూ ఎదురెళ్లి నామం చెపుతూ తీసుకుని వస్తున్నారు. నేను పూజ్యశ్రీ అమ్మగారి దగ్గర కూర్చుని పూలమాల కడుతున్నాను. ఈ మాల పూజ్యశ్రీ మాస్టరుగారికి

వేస్తే బాగుండును అనిపించింది. కానీ ఆయనకు వేయడానికి పూల దండ పురమాయించారు. పూజ్యశ్రీ మాస్టరుగారు రానే వచ్చారు. ఈ లోపున ఒకరు వచ్చి నా చేతిలో మాల తీసుకుని పూజ్యశ్రీ మాస్టరుగారికి వేశారు. అంటే అప్పటికి ఇంకా ఆ దండ రాలేదని, ఈ మాల వేసారట. నాకు చాలా సంతోషంగా అనిపించింది. మనస్ఫూర్తిగా కోరుకుంటే అమ్మగారి సమక్షంలో నెరవేరకపోవడం అనేదే వుండేది కాదు. మా సత్సంగ సభ్యులందరము కలిసి 15 మంది దాకా వుండే వాళ్ళము అంతే! మేమే అన్ని పూజలు, పండగలు చేసుకునేవాళ్ళము. ఒకరోజు ఒక సత్సంగసభ్యురాలికి, పూలంగి సేవ చేసుకొమ్మని పూజ్యశ్రీ మాస్టరుగారు కలలో చెప్పారట. వెంటనే మేము పూజ్యశ్రీ అమ్మగారికి ఈ విషయం చెబితే, అలాగే చేసుకోమన్నారు. ఆ రోజు పెద్ద పండగ లాగ వుండేది. పూలు తేవటం, మాలలు అల్లటం, అలంకరించటం,,,అప్పట్లో కొత్త కావడం వల్ల అలంకరణ సరిగా రాక మాలలు వేళ్ళాడ దీసేవాళ్ళం. తరువాత ముందు భాగం మాత్రమే అలంకరించేవాళ్ళం, తరవాత నేను పేపర్ మీద పూలతో డిజైన్ వేసుకుని తెచ్చేదాన్ని. దానిని షాల్ మీద (సూది దారంతో కుట్లు వేసి) అతికించేవాళ్ళం. ఒకరోజు సరిగా కుదరక పాతే, పూజ్యశ్రీ మాస్టరుగారు(విగ్రహం లో) భుజాలు కదిపి సరిచేసుకోవడం మేమందరం చూసాము. ఒకసారి పూజ్యశ్రీ మాస్టరుగారు నాకు కలలో కనపడి, "పూలంగి సేవ యిలాగేనా చేయడం?" అని అడిగారు. ఆ సంగతి నేను పూజ్యశ్రీ అమ్మగారితో చెప్పాను. అప్పుడు అమ్మగారు, తిరుపతిలో వెంకటేశ్వర స్వామికి ఎలా చేస్తారో వివరంగా చెప్పి అలా చేసుకోమన్నారు (పూజ్యశ్రీ అమ్మగారు ఏ విషయమైనా చాలా వరకు మనం అడిగితేనే చెప్పేవారు). అప్పటినించి, పూల అలంకరణ అయ్యాక, బాబా అష్టోత్తరం చదివి, నివేదన చేసి, హారతి ఇచ్చేవాళ్ళం. అది ఇప్పటి వరకు అలాగే కొనసాగుతోంది. అదే విధంగా పత్రికసేవ కూడా మాతోనే మొదలయ్యింది. అంతకుముందు, రెండు మూడు రోజులు బైటవాళ్ళని పిలిచి చేయించేవారు. తరవాత మేమందరం పూజ్యశ్రీ అమ్మగారి అనుమతితో ఆ సేవ కూడా చేసుకోవడం మొదలు పెట్టాము. పత్రిక సేవ అయిపోగానే పూజ్యశ్రీ అమ్మగారు మమ్మల్నందరిని పిలిచి, రకరకాల ప్రసాదాలు పెట్టేవారు. పూజ్యశ్రీ అమ్మగారు మంచి మంచి విషయాలు చెప్తూ వుంటే, అవన్నీ వింటూ తినేవాళ్ళం. ఒకొక్కసారి అందరం మధ్యాహ్న సమయంలో ఒకొక్క పదార్ధం, చేసుకుని తీసుకువస్తే, అవన్నీ పూజ్యశ్రీ మాస్టరుగారికి నివేదించి , పెద్ద పళ్లెంలో అవన్నీ కలిపేసి, అమ్మగారే మాకు పెద్ద పెద్ద ముద్దలు పెట్టేవారు. ఒకొక్కసారి తోట పని కూడా చేసేవాళ్ళం. దానికోసం పొద్దున్నే వెళ్లిపోయేవాళ్ళం. అప్పుడు, పూజ్యశ్రీ అమ్మగారు కూడా బయిటికి వచ్చి కూర్చుని, సలహాలు, సూచనలు చేస్తూ సేవ చేయించే వారు. అప్పట్లో మేము ఏ సేవ అయినా పూజ్యశ్రీ అమ్మగారి సమక్షంలోనే చేసుకునే వాళ్ళం. సేవలే కాదు పండగలు కూడా చేసుకునే వాళ్ళం. ముఖ్యంగా వరలక్ష్మి వ్రతం! పూజ్యశ్రీ అమ్మగారి పుట్టినరోజు వేడుకలు కూడా ముందుగా మాతోనే మొదలయ్యాయని చెప్పవచ్చు.

ఒకసారి చివటం అమ్మ ఆరాధన రోజు అమ్మగారి సమక్షంలో పూజ చేసుకోవడానికి వెళ్ళాము. ఆరోజు నేను మైసూర్ పాక్ ప్రసాదం చేసుకుని తీసుకుని వెళ్లాను. పూజ అంతా అయిపోయాక, నేను చేసిన ప్రసాదం పూజ్యశ్రీ అమ్మగారి చేత తాకించి నివేదన పెట్టడానికి తీసుకుని వస్తూ, ఈరోజు మైసూర్ పాక్ అమ్మగారికి తినిపిస్తే బాగుండును అనిపించింది. ఎప్పుడు పూజ చేసుకున్నా మేము తెచ్చిన ప్రసాదాలన్నీ అమ్మగారిచేత తాకించి, అప్పుడు నివేదన చేసేవాళ్ళం. ఆరోజు కూడా అలాగే చేసి, పూజంతా అయ్యాక అమ్మగారి దగ్గరకి వెళ్లి, "అమ్మా! ఈ రోజు మీకు మైసూరుపాక్ తినిపించాలని గాఢంగా అనిపిస్తోంది",,,,అని ఒక్క నిమిషం ఆగాను. వెంటనే అమ్మగారు ,"ఓ! తప్పకుండా తినిపించండి, ఇందాక మీరు మూత తీసి చూపించినప్పుడే నాకూ తినాలి అనిపించింది" అన్నారు. నేను వెంటనే పూజ్యశ్రీ అమ్మగారికి మైసూర్ పాక్ తినిపించాను. అదొక మధురానుభూతి. ఆ సంఘటన ఎప్పటికి మరపురానిది. ఇంకొకసారి పూజ్యశ్రీ అమ్మగారి గదిలో బాబా, మాస్టరు గార్లకు పూజ చేసుకుంటున్నాము. ప్రసాదం పెట్టాము గాని, మంచి నీళ్లు పెట్టడం మర్చి పోయాము, నేను లేచివెళ్లి ఒక గ్లాసుతో మంచినీళ్లు తీసుకుని వస్తూ అమ్మగారి వైపు చూసాను, ఒక్కసారి ఒళ్ళు జలదరించింది, పూజ్యశ్రీ అమ్మగారు ఒక కాలు పైకి మడత వేసుకుని, ఇంకొక కాలు కిందకి వేలాడేసుకుని

ఒంటినిండా నగలతో అమ్మవారిలా కనిపించారు. ఒకే ఒక్క నిముషం!. కానీ నాకు చాలాసేపు గుండె దడదడ లాడింది. అటువంటి దర్శనం ప్రసాదించిన మహాలక్ష్మి స్వరూపిణి అమ్మగారికి కోటి కోటి ప్రణామములు. ఆ రోజులు మరపు రానివి. ప్రతి రోజు అమ్మగారితో సాన్నిహిత్యం! అమ్మగారిని విడిచి మమ్మలిని మేము వూహించుకోలేని రోజులు గడిపాము. ఇళ్లల్లో అన్ని పనులు చేసుకుని అమ్మగారి దగ్గరకి పరిగెత్తేవాళ్ళం. చాలా కొద్ది రోజులలోనే మాస్టరుగారు చూపించే ప్రేమని అమ్మగారి దగ్గర పొందాము. మాకైతే పూజ్యశ్రీ మాస్టరుగారికి, పూజ్యశ్రీ అమ్మగారికి భేదమే లేదనిపించేది. ఇలా ఆనందంగా రోజులు గడుస్తుండగా, పిడుగుపాటు లాంటి వార్త , పూజ్యశ్రీ అమ్మ గారు హైదరాబాద్ వెళ్లిపోతున్నారని. ఇక మా అందరి బాధా వర్ణనాతీతం. ఎంతగా అమ్మగారు మాకు సర్ది చెప్పినా ఊరడిల్లని శోకం.

పూజ్యశ్రీ అమ్మగారు హైదరాబాదు వెళ్లిపోయారు. అప్పుడు అమ్మగారితో ఫోన్ లో మాట్లాడే అవకాశం ఉండేది. ఒంగోలులో పూజ్యశ్రీ అమ్మగారు జరిపించే కార్యక్రమాలన్నీ, మేము యథాతథం చేసేవాళ్ళం. ఇంచుమించు ప్రతిరోజూ అమ్మగారితో మాట్లాడే వాళ్ళం. కొన్నాళ్ళకి, కావలి బాబా గుడిలో పూజ్యశ్రీ మాస్టరుగారి విగ్రహ ప్రతిష్టకి అమ్మగారు కావలి వచ్చారు. మమ్మలిని కూడా రమ్మని కబురు చేసారు. మేము కొంతమందిమి ఒంగోలు నించి వెళ్ళాము. పూజ్యశ్రీ అమ్మగారు కావలి డాక్టరుగారి ఇంట్లో బస చేశారు. మేము కూడా మూడు రోజులు అక్కడ వున్నాము. ప్రతి రోజు ఉదయం 10 గంటలకు పూజ్యశ్రీ అమ్మగారు సత్సంగం చేసేవారు. ఒకరోజు ఒకలీల జరిగింది. మేమందరం ఉదయం 10 గంటలు అవ్వగానే అమ్మగారి గదిముందు హాజరయ్యేవాళ్ళం. ఆ గదికి చిన్న గడప ఉండేది., అమ్మగారు కూర్చునే సింహాసనాన్ని ఆ గడప దాటించాలి. ప్రతి రోజు సేవకులు ఆసేవ చేసేవారు. కానీ ఆ రోజు ఆ సమయానికి అక్కడ ఎవరూ లేరు, పూజ్యశ్రీ అమ్మగారు నావైపు చూసి సింహాసనం పట్టమన్నట్లు సైగ చేసారు. నాకు కాస్సేపు ఏమి చేయాలో అర్ధం కాలేదు, నేను ఒక్కదానిని ఎలా పట్టడం అని ఆలోచిస్తూ, ధైర్యం చేసి రెండు చేతులతో పైన, కింద పట్టుకుని పైకి లేపాను. నాకు తెలియకుండానే అమ్మగారు అతి తేలికగా గడప ఇవతలికి వచ్చేసారు. నాకు చాలా చాలా ఆశ్చర్యం వేసింది, అదెలా సాధ్యం అని! ఆ రకంగా నాకు సేవని ప్రసాదించారు మన అమ్మగారు. ప్రతి రోజు సత్సంగంలో మేమందరము రకరకాల ప్రశ్నలు అడిగేవాళ్ళం. అందులో నాకు గుర్తున్న ఒకటి రెండు మీతో పంచుకుంటాను.

మహాత్ములతో ఋణానుబంధం ఉండాలంటే ఏం చెయ్యాలమ్మా? అని నేనుఅడిగినదానికి,పూజ్యశ్రీఅమ్మగారు "మనం లౌకికంగా స్వీకరించడం తక్కువ, ఇవ్వడం ఎక్కువగా ఉంటే, మహాత్ములతో ఋణానుబంధం ఉంటుందని చెప్పారు. "అమ్మా, రోజూ మీ దర్శనం చేసుకుంటున్నాం, ఇంటికెడుతున్నాం. ఇక్కడ ఉన్నంతసేపూ హాయిగా ఉంటుంది. ఇంటికెళ్ళాక, ఇదంతా మర్చిపోయి మామూలుగా అయిపోతున్నాం. మీ దగ్గర ఉన్నట్లు ఇంట్లో కూడా ఉండాలంటే ఏం చెయ్యాలమ్మా?"అని అడిగితే, అమ్మగారు, "నిరంతర స్మరణ, శరణాగతి చెయ్యాలి" అని చెప్పారు. "శరణాగతి ఎలా చెయ్యాలమ్మా?" అని అడిగితే, పూజ్యశ్రీ అమ్మగారు "మనం ఏ పని చేస్తున్నా బాబాకు అర్పించి చెయ్యడం, ప్రతిపని ఆయన సమక్షంలో ఆయన కోసం చెయ్యడం, చేసేపని స్పష్టతతో చెయ్యడం. కొంతమంది డబ్బుంది కదా, దక్షిణ రూపంలో ఇస్తున్నాము కదా అని, శారీరక శ్రమ చేయరు. కొంతమంది శారీరక శ్రమ చేస్తున్నాం కదా అని, దక్షిణ ఇవ్వరు. కొంతమంది అజమాయిషీ మాత్రమే చేస్తారు, కానీ అస్సలు నడుం వంచరు. ఇదంతా అహంకారమే, ఏం లాభం? అది పోవడానికి ఎన్నో జన్మలు పడుతుంది. ఏది చేసినా శరణాగతి మార్గంలో చేస్తేనే ఫలితం ఉంటుంది" అని చెప్పారు. ఇలా మేము తెలిసీతెలియకుండా అడిగే ప్రశ్నలకి పూజ్యశ్రీ అమ్మగారు ఎంతో ఓర్పుగా సమాధానం చెప్పేవారు.

మేమందరం ఒంగోలులో చాలా బాధ పడుతున్నామని మళ్ళీ పూజ్యశ్రీ అమ్మగారు, ఒంగోలుకి వచ్చి కొంతకాలం వున్నారు. అప్పుడు మళ్ళీ మేమందరం ఎంతో అపురూపంగా సమయాన్ని అమ్మగారితో గడిపేవాళ్ళం. తిరిగి అమ్మగారు హైదరాబాదు వెడుతుంటే, అందరం విపరీతంగా బాధపడుతుంటే, పూజ్యశ్రీ అమ్మగారు నాతో, "ఎందుకు బాధపడతారు? మీరూ వస్తారుగా" అన్నారు. తరువాత ఆలోచిస్తే ఎటువంటి పరిస్థితులలోను,

నేను ఒంగోలు నించి హైదరాబాదుకు వెళ్లే అవకాశమే లేదు. కానీ కాలచక్రంలో, పరిస్థితులన్నీ, అలా అలా మారి, పూజ్యశ్రీ అమ్మగారు చెప్పిన మాట పొల్లుపోకుండా, నేను అమ్మగారి ఇంటి సమీపంలోనే ఇల్లుకట్టుకుని రాగలిగాను. అంటే అది అమ్మగారి దయ మాత్రమే! అమ్మగారు ఎన్నో ఆపదలనించి రక్షించారు. ఎన్నో అవసరాలు తీర్చారు. ఎన్నో అనుభవాలని ఇచ్చారు, ఎన్నెన్నో అనుభూతులని ప్రసాదించారు. వారి కరుణకి అంతు ఎక్కడిది? పూజ్యశ్రీ అమ్మగారి స్మృతులను అందరితో పంచుకునే మహద్భాగ్యం రావడం నా అదృష్టంగా భావిస్తూ, జన్మ జన్మలకి నేను వారితోనే వుండాలని ఆ పుణ్యమూర్తులను సవినయంగా ప్రార్థిస్తున్నాను.

జై సాయి మాస్టర్!!

---

# వార్తాలాపము

14వ పేజీ తరువాయి

ఈ ఉద్దేశముతో ఆచార్యులు తమ మధ్యవర్తులైన ప్రతినిధులద్వారా తమ మహాత్మ్యాన్ని వెల్లడించడానికి అన్ని రకాల ఏర్పాట్లనూ చేయించుకుంటారు. "యస్య దేవే పరా భక్తిర్యథా దేవే తథా గురౌ" – దేవుడిపట్ల చాలా భక్తి కలవాడికి ఆ దేవుడి పట్ల ఎంతటి భక్తి వుంటుందో అటువంటి భక్తే గురువుపట్ల కూడా వుంటుంది. ఈ వేదవాక్యమును ఆధారంగా చూపించి లోకకల్యాణం కోసం తమ దేహానికి దేవతామూర్తికి లాగ పూజలు, అర్చనలు చేయించుకుంటారు. ఇది ధర్మకార్యము అని గుడ్డినమ్మకం గల ప్రజలు భావిస్తారు.

ఇలా దేహాత్మవాదులైన మానవులు శరీరమే ఆత్మ అని భావించి శరీరమనే ఆత్మ నశించిన తరువాత పుణ్యపాపాలు, స్వర్గనరకాలు వుండవని నమ్మి ఇష్టమొచ్చినట్లు ప్రవర్తిస్తారు. ఇది అసుర ప్రకృతి. ఈ రాక్షస, అసుర ప్రకృతుల గురించి ముందుగా తెలిసికోవడం వలన ఒక ప్రయోజనమున్నది. బట్టపైనున్న మురికి తుడిచివేయనిదే రెండవ రంగు ఎక్కనట్లు, అంతఃకరణంలో ఎంతకాలంనుండో నిలువవున్న రాక్షస, అసుర ప్రకృతుల ధర్మాలైన రాగద్వేషాలనే మలవిక్షేపదోషాలు పోనంతవరకూ దైవసంపద లభించడం కష్టము.

రాక్షస, అసుర ప్రకృతుల పరంపర

ఈ రాక్షస, అసుర ప్రకృతులలోని ఒక గుణము వచ్చినట్లైతే మిగిలిన గుణాలన్నీ అటువంటివే కావడం వలన (సజాతీయములు) వెంటవెంటనే వస్తాయి.

ఒక రాజు ఒక ప్రదేశంలో వేదము, మద్యము, వేశ్య – ఈ మూడు వస్తువులను వుంచి ఇలా ఆజ్ఞాపించాడు –

1. ఈ వేదము అబద్ధమని చెప్పాలి. లేదా,
2. ఈ మద్యాన్ని సేవించాలి. లేదా,
3. ఈ వేశ్యను అనుభవించాలి.

అటువంటి వాడికి దక్షిణ బహుమతిగా లభిస్తుంది.

బ్రాహ్మణులందరూ అక్కడికి వచ్చి ఈ వింత షరతులను విని వెనుకకు వెళ్ళిపోయారు.

ఒక పేద బ్రాహ్మణుడు మాత్రం మద్యపానం చేసి ప్రాయశ్చిత్తము చేసుకోవచ్చు అనుకుని మద్యపానం చేస్తానని వచ్చాడు. ఆ మూడు వస్తువులూ వున్న ప్రదేశానికి వెళ్ళి మద్యపానము చేసి రమ్మని రాజు బయట కూర్చున్నాడు. బ్రాహ్మణుడు మద్యం సేవించాడు. అంతకంతకూ అతడికి మత్తెక్కి మద్యాన్ని ఎక్కువగా సేవించాడు. ఆ తరువాత ఒళ్ళు తెలియకుండా వేశ్యను కూడా అనుభవించడానికి బయలుదేరాడు. అప్పుడు రాజు అతనికి "ఆ పని వేదంలో నిషేధింపబడినది!" అని చెప్పాడు. వెంటనే బ్రాహ్మణుడు ఆ వేదాలను అసత్యాలన్నాడు.

ఇలానే ఒక నిషిద్ధపదార్థాన్ని స్వీకరించిన తరువాత మరొక నిషిద్ధపదార్థాన్ని స్వీకరించకూడదనే వివేకం పోతుంది. నెమ్మది నెమ్మదిగా అసురసంపదలు అన్నీ ఒకదాని వెంట మరొకటి వచ్చి మానవుడిని వశపరచుకుంటాయి.

అప్పుడందరూ తమ తమ ఇళ్ళకు వెళ్ళారు.

**(ఎనిమిదవ ప్రసంగము సమాప్తము)**

# సాయీ కా బేటా

**శ్రీ సుబ్బరాజు**

**('భరద్వాజ నా బిడ్డ' అన్న బాబా స్వప్న సందేశం వల్ల మాస్టారు గారు మహనీయుడనీ, మరియు ముగ్గురు ఋషుల ద్వారా మాస్టర్ గారినే తమ గురువుగా స్వప్న సందేశాన్ని అందుకున్న అదృష్టవంతుడు.)**

నా పేరు సుబ్బరాజు, నాకు మాస్టరుగారిని 1978-79 లో విద్యానగర్ మందిర ప్రారంభోత్సవ సమయంలో తొలిసారిగా దర్శించే భాగ్యం కలిగింది. ఆ ఉత్సవానికి స్వామి కేశవయ్యజీ ని ఆహ్వానించారు. ఆ వూరి జనాలైతేనేమి, చుట్టు ప్రక్కల గ్రామాల నుంచి అయితే నేమి, దూర ప్రాంతాలనుంచి అయితే నేమి పదివేల మందికి పైగా జనాలు వచ్చారు. నేను మాస్టార్ గారితో పాటు మందిరంలోనే వున్నాను. కేశవయ్యజీ 90 ఏళ్ళ వృద్ధులు. మాస్టార్ గారు కేశవయ్యజీ గారికి పాదపూజ చేశారు. మమ్మల్ని కూడా పాదనమస్కారం చేసుకోమన్నారు.

ఒకసారి సాయిలీలామృతము భరద్వాజ గారు రచించినట్లు పేపర్లో చూసి వారి అడ్రస్ కి లెటర్ రాసి పంపాను. వెంటనే నాకు లీలామృతము పంపించారు. ఆ గ్రంథం చదివిన తర్వాత బాబాకు పూజ చేసుకోవటం జరిగింది. ఆ తర్వాత విద్యానగర్ లో మందిర ప్రారంభోత్సవానికి ఆహ్వానం వచ్చింది. అది పురస్కరించుకొని విద్యానగర్ వెళ్ళటం జరిగింది. ఆ ఫంక్షన్ అయిపోయిన మర్నాడు నేను మా వూరు విజయనగరం బయల్దేరేటప్పుడు మాస్టారుగారు నన్ను చివటం అమ్మను, రంగన్న బాబుగారిని దర్శనం చేసుకోమన్నారు. నేను వూరుకెళ్తున్నానని చెప్పి వారి అనుమతిని అడిగితే, "ఒక అరగంట ఆగి వెళ్ళండి" అన్నారు. అలాగే వెళ్తే జి.టి. ఎక్స్ ప్రెస్ 2 గంటలు లేటుగా వచ్చి నాకు అందింది. అది ఆయనకు ముందే తెలుసునన్న తార్కాణం యిచ్చారు. అప్పుడే ఆయన దైవ స్వరూపులు అని అన్పించింది. మాస్టారుగారు చివటం అమ్మను చూడమని చెప్పినా నాకా అదృష్టం లేక అమ్మను చూడలేక పోయాను.

మాస్టారుగారు రకరకాల కష్టాలలో వున్నప్పుడు వారి పై 'ఎన్-కౌంటర్' అన్న పత్రికలో వచ్చిన 'అనుమానించ బడుతున్న యోగి' అన్న ఆర్టికల్ ని చదివినప్పుడు నా విశ్వాసం కొంత సడలింది. బాధపడ్డాను. ఆరోజు రాత్రి బాబా నాకు కలలోకి వచ్చి భరద్వాజ గారిని గట్టిగా వాటేసుకుని, "భరద్వాజ నా బిడ్డ, నువ్వు వెళ్తున్న దారి మంచిదే" అని చెప్పారు. అప్పుడు నాకిక నిదర్శనం బాబానే యిచ్చారు కదా అని ఎంతో సంతోషించాను.

ఒకసారి మాస్టారుగారు "గురుచరిత్ర 108 సార్లు చదివితే మంచిది" అన్నారు. అందుకని నేను 108సార్లు పారాయణ చేశాను. చేసిన

కొన్ని రోజులకు గోచి పెట్టుకొని ఒక యోగి వచ్చి మా యింట్లో కూర్చున్నారు. "మీరు యోగులు కదా మా యింటికెందుకు వచ్చారు" అని అడిగాను. "నువ్వు 108 సార్లు పారాయణ చేశావు కదా! అందుకే వచ్చాను" అన్నారు. "మరి యిప్పుడు నన్నేం చేయమంటారు?" అంటే 108 వత్తులతో హారతిమ్మన్నారు. ఆ మరుసటి రోజే మేము దత్తునికి పూజ చేసుకున్నాం. పూజ అయిపోయిన తర్వాత ఒక కోయతను వస్తే దక్షిణ, తాంబూలం, ఒక లడ్డు కూడా యిచ్చాను. అతను "నాకు వాక్కొచ్చింది చెప్తాను" అన్నారు. నాకు కోయ వాళ్ళంటే అయిష్టం. నమ్మకం లేదు. అందువల్ల "నాకేమీ చెప్పనక్కర్లేదు" వెళ్ళమన్నాను. ఆ తర్వాత మాస్టారుగారు ఒకసారి విజయవాడ వచ్చినప్పుడు అడిగాను, "ఏంటి మాస్టారుగారు నా కిలా కల వచ్చింది" అని చెప్తే, "ఆ రోజు మీ యింటికి దక్షిణ కోసం ఎవరన్నా వచ్చివుంటారు తప్పకుండా" అని అన్నారు. అప్పుడు కోయవాడు రావటం గురించి చెప్పాను.

ముత్యాలంపాడు ధుని ఓపెనింగ్ కి మాస్టారుగారొచ్చారు. కార్యక్రమం అయిన తర్వాత మాస్టారుగారిని వసుంధర మేడం గారింటికి రాత్రి పదకొండు గంటలప్పుడు తీసికెళ్ళినపుడు, "మీరు వెంటనే వెళ్ళిపోండి. గుడి దగ్గర నెల్లూరు నుంచి వచ్చిన రెడ్డిగారు వాళ్ళున్నారు. వాళ్ళని కొంచెం రైల్వే స్టేషన్ దగ్గర వదలి పెట్టి, మీరు వెంటనే వెళ్ళిపోవాలి. గొడవలు జరగవచ్చు" అని తొందర పెట్టారు. నేను అలానే చేశాను. ఆ రోజు ఒక రాజకీయ నాయకుడు హత్య చేయబడ్డాడు. ఆ కారణంగా అల్లర్లు జరుగుతాయని మాస్టారుగారికి తెలిసి చెప్పగలిగారు.

మాస్టారుగారితో పాటు నేను దాదాపు మూడు సార్లు యాత్ర కెళ్ళాను. గాణ్గాపూర్, నర్సోబావాడి, కురువపురం ఇతర దత్త క్షేత్రాలు సందర్శించాను. ఆయన సామాన్యుల లాగే బస్ ఆగిపోతే ఆ మట్టిలో అలాగే దుప్పటి పరచుకొని పడుకునేవారు. ఎంతో నిరాడంబరంగా ఆయన మాతో వుండి మాకు క్షేత్రాలు చూపించేవారు. రామిరెడ్డి తాతగార్ని చూపించారు. ఎక్కడ ఏ అవధూతలున్నారంటే అక్కడికి తీసికెళ్ళి చూపించేవారు. లేదా ఫలానా చోట ఫలానా వారున్నారు చూచిరమ్మని చెప్పేవారు. వారికి మాస్టారుగారు కూడా మాతో పాటే పూజ చేసేవారు. మా చేత చేయించేవారు. వారి దృష్టి మన మీద పడితే చాలు అన్నట్లుండే వారు. ఆయనెప్పుడూ సంతోషంగా వుండేవారు. నేను మొదటిసారి మాస్టారుగారిని చూచినప్పుడే ఆయనలో ఏదో శక్తి వున్నట్లనిపించింది. ఎంతో ఆకర్షణీయంగా వుండి మహాపురుషుడు అని అన్పించి నా గురువుగా భావించుకున్నాను. పూజించటం మొదలెట్టాను. తర్వాత బాబాను కూడా మాస్టారుగారి ద్వారానే తెలుసుకోగల్గాను. చరిత్ర పారాయణ చేస్తూ వుంటే బాబా కూడా అనేకసార్లు దర్శన మిచ్చారు. సమస్యలని కొన్నింటిని పరిష్కరించారు కూడా.

మానాన్నగారు చనిపోయిన తర్వాత గుళ్ళోకెళ్ళకూడదని ఒక సంవత్సరం పాటు పూజ చేయకూడదని అంటున్నారు. మనం సంవత్సరాని కోసారి మన పూర్వికులకు తద్దినాలు పెడుతూ వుంటాం. వాళ్ళకి అందుతుందా? అని మాస్టారుగారికి లెటర్ వ్రాసాను. మాస్టారుగారు, "పదకొండవ రోజు వరకు చేయకూడదు. తర్వాత చేయవచ్చు. సాలగ్రామాలు అవీ వుంటే చేయకూడదు. కాని మనం నిత్యపూజ చేసుకోవచ్చు. నీకు వారు పూర్ణులు అని గట్టి నమ్మకముంటే తద్దినాలు పెట్టనక్కరలేదు. ఇంకో వుద్దేశమేమంటే ఆ సందర్భాన్ని పురస్కరించుకొని సంవత్సరానికొక రోజైనా అందరూ కలుసు కోవటం వారి పేరుతో దానం చేయటం అనేది జరుగుతుంది. అనే ఉద్దేశం కూడా కావచ్చు " అని వ్రాశారు.

ఆ తర్వాత మాస్టారు.గారిని మా యింటి శంకుస్థాపనకు రమ్మనమని అడిగాను. "నేను చాలా బిజీగా వున్నాను. మీరు మీ కార్యక్రమం జరుపుకోండి. నా ఆశీస్సులు మీ కెప్పుడూ వుంటాయి" అని రాశారు. సరే ఆయనను స్వయంగా వెళ్ళి దర్శించుకొని తీసుకొద్దామని ఆ ముందు రోజు వెళ్ళాను. "ఏంటీ నన్ను తీసుకెళ్ళటానికి వచ్చారా!" అని అన్నారు. తర్వాత ఆయన విషయాలన్నీ చెప్పి "మరి ఈ పరిస్థితులలో రమ్మంటావా" అని నన్నే అడిగారు. "సరే మీకు వీలు లేకపోతే మీ ఆశీస్సులు నాకు కావాలి" అని అడిగాను. నన్ను బాబా మందిరానికి తీసుకెళ్ళి ధుని చుట్టు తిప్పి, ధునిలో కొబ్బరికాయ అదీ వేయించి, ధుని పూజ చేయించి, నాకు కొన్ని అక్షింతలు ఇచ్చి నాకు సెలవిచ్చారు. రోడ్డు మీద కొచ్చిన తర్వాత మళ్ళీ నన్ను పిల్చారు. "గృహప్రవేశానికి నేను తప్పకుండా వస్తా" అని రెండు సార్లన్నారు. సరేనని మళ్ళీ నమస్కారం చేసుకొని వచ్చాను. శంకుస్థాపన యథావిధిగా జరిగిపోయింది. గృహప్రవేశం యింకా

రెండు నెలలుందనగా మాస్టారుగారు సమాధి చెందారు. ఆ రోజు నేను ఊళ్ళోలేను. వూరి నుంచి రాగానే ఇంట్లో వాళ్ళు కన్నీళ్ళతో మాస్టారుగారు సమాధి చెందారని చెప్పారు. ఆ మాట విని నేను తట్టుకోలేక పోయాను. పగలు 12 గంటల సమయం. అలా మంచం మీద పడిపోయాను. నిద్ర కాదు, మెలకువ కాని చేతనావస్థలో కెళ్ళి పోయాను.

అప్పుడొక దృశ్యం. ఒక చెట్టు కింద ముగ్గురు ఋషులు పద్మాసనంలో కూర్చుని వున్నారు. వారికి మేము నమస్కారం చేసుకుంటున్నాము. అప్పుడు వారన్నారు "మీ గురువు కన్పించరని బాధపడ్తున్నారు. నీ వెనకాలే నీ గురువు గారున్నారు. చూడు" అన్నారు.

నేను వెనక్కి తిరిగి చూస్తే అక్కడ మాస్టార్ గారు అద్భుతంగా నవ్వుతూ కన్పించారు. వారి పాదాలకు నేను నమస్కారం చేసుకున్నాను. కల చెదిరి పోయింది. 'నేను సమాధి అయినా నేను నీ వెనకాల యింకా వున్నాను' అని చెప్పినట్లుండి నా విశ్వాసం ఇంకా ఇంకా దృఢ పడింది. గృహప్రవేశానికి అయిదు నిముషాల ముందు అక్కల్ కోట స్వామి వారి పాదుకలు మా ఇంటి కొచ్చాయి. నేను గృహప్రవేశానికి వస్తానన్న మాస్టార్ గారి మాటలు గుర్తొచ్చి కళ్ళకు నీళ్ళొచ్చాయి "మహానుభావా! ఈ రూపంలో నన్ను ఆశీర్వదించటానికి కొచ్చారా!"అని మనసారా నమస్కరించుకున్నాను. వారిదంతా ఒకే కుంటుంబం. అందుకని మా గృహానికి 'సాయి కృప భరద్వాజ నిలయం' అని పేరు పెట్టటం జరిగింది.

# సిద్ధయ్య

11వ పేజీ తరువాయి

నివేదన చేస్తూ వుండటం చూసిన గోవిందమ్మ తాను కూడా 'చలిది అన్నం వండుతుంది. అది చూసిన శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి పోలేరమ్మగుడికి వెళ్ళి నివేదన యివ్వనక్కర లేదని, ఆమెనే యింటికి ఆహ్వానించి నివేదన యిద్దామని గోవిందమ్మకు చెప్పి, "పోలేరమ్మా! మాయింటికి వచ్చి, మేము యిచ్చే ఈ నైవేద్యం సేకరించు" అంటూ కేకవేసి పిలుస్తారు. వెంటనే పోలేరమ్మ ఘల్లు ఘల్లుమనే కాలి అందెలు సవ్వడి చేస్తుండగా స్వామి గృహానికి నడచి వచ్చి, నైవేద్యం ఆరగించి వెళ్ళిపోతుంది. ఆ దృశ్యాన్ని కళ్ళారా చూసిన ప్రజలు జయజయ ధ్వనులతో స్వామిని కీర్తిస్తారు. ఈ విధంగా స్వామి ఎన్నో మహిమలు చూపుతూ, ప్రజలను అనుగ్రహిస్తూ వుంటారు. భక్తుల కష్టాలను తొలగిస్తూ, కోరికలు తీరుస్తూ, జ్ఞాన బోధ గావిస్తూ, లోకోద్ధరణ అనే తన అవతార లక్ష్యాన్ని నిర్వర్తిస్తుంటారు. కొన్ని సందర్భాలలో చనిపోయినవారిని బ్రతికించిన సంఘటనలు కూడ ఎన్నో! ఆ కాలంలోనే సిద్ధయ్యకు స్వప్న దర్శనమిచ్చి తన చెంత చేర్చుకుంటారు స్వామి. అతని తల్లిదండ్రులెంతగా బ్రతిమాలినా యింటికి తిరిగి వెళ్ళక, స్వామిసన్నిధికి అంకితమై స్వామిసేవలో కాలం గడుపుతూ వుంటాడు సిద్ధయ్య.

కందిమల్లయ పల్లె లోని శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి ఆశ్రమం వీడి నిరాశ, నిస్పృహలతో ముడుమాల గ్రామం చేరుకున్నారు, ఆదంబీ, పీర్ సాహెబ్. నిజానికి వారి దేహాలు మాత్రమే ముడుమాల చేరాయి. పంచప్రాణాలు తమ కుమారుడు సిద్ధయ్యతోనే వుండిపోయాయి. ఎంతో దిగులుతో క్రుంగిపోతూ జీవచ్ఛవాలలాగా కాలం వెళ్ళబుచ్చుతున్నారు ఆ దంపతులు.

సిద్ధయ్య తల్లిదండ్రులు కందిమల్లయ పల్లె నుండి తిరిగి వచ్చారనీ, అయితే సిద్ధయ్య మాత్రం అక్కడే వుండిపోయాడని తెలుసుకున్న ముస్లింవాడలోని ప్రజలు ఆగ్రహంతో ఊగిపోయారు. శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి సన్నిధిలోనే వుండిపోయినందుకు సిద్ధయ్యపైనా, సిద్ధయ్యను అక్కడే వదలి వచ్చినందుకు పీర్ సాహెబ్, ఆదంబీల పైనా వారికోపం కట్టలు తెంచుకుంది. ఇస్లాం విరుద్ధమైన యీ చర్యను ఏవిధంగా అడ్డుకోవాలన్న విషయమై చర్చించుకొనటానికై పీర్ సాహెబ్ సమక్షంలోనే ముస్లింలు అందరూ సమావేశమైనారు. సిద్ధయ్య యే తనంత తానుగా శ్రీవీరబ్రహ్మేంద్రస్వామి వారి వద్దకు వెళ్ళడం జరిగింది. కనుక తప్పు సిద్ధయ్యదేనని ఒకరన్నారు. ఒక ముసల్మాను యువకుడిని చేరదీసేహక్కు హిందూ మత గురువుకు ఎక్కడిదనీ, కనుక తప్పంతా శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామిదేననీ మరొకరన్నారు. ఏది ఏమైనా కొందరు మతపెద్దలు, గురువులు ఆశ్రమానికి వెళ్ళి, సిద్ధయ్యను, శ్రీస్వామివారినీ ఒప్పించి, సిద్ధయ్యను వెనుకకు రప్పించే ప్రయత్నం చేయాలనీ, ఆ ప్రయత్నం విఫలమైతే ఈ విషయమై కడప నవాబుకు ఫిర్యాదు చేయాలనీ చివరగా అందరూ ఒక నిర్ణయానికి వచ్చారు.

**- సశేషం**

# రాధాకృష్ణ ఆయీ

*పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ*

మనమీనాడు దేశంలోని ఏ సాయి మందిరము దర్శించినా, అక్కడ బాబా మూర్తిని భక్తులు మహరాజుగా అలంకరించి పూజించడం చూస్తాం. సాయికి నాల్గువేళలా ఆరతులు పాడడం, గురువారంనాడు వారి మూర్తిని, పాదుకలనూ రాజ లాంఛనాలతో ఊరేగించడం చూస్తాం. ఇందుకు కారణం యివన్నీ శిరిడీ సంస్థానంలో సాయికి జరిగే సేవలే. మొదట పేద భిక్షువుగా మాత్రమే జీవించిన సాయిని ప్రత్యక్షంగా పూజించడం, వారి మశీదును రాజదర్బారులా అలంకరించడము, ఆరతులు జరిపించడము – వీటన్నింటినీ మొదట ఆరంభించినది భక్తురాలు రాధాకృష్ణ ఆయీ.

రాధాకృష్ణ ఆయీ మొదటిసారి నానాసాహెబ్ చందోర్కర్ తో కలిసి 1905లో పండరీపురంనుండి శిరిడీ వచ్చింది. ఆమె అసలు పేరు సుందరీబాయి క్షీరసాగర్. ఆమె తాత అహ్మదునగర్ లో పేరుమోసిన న్యాయవాది. చిన్న వయసులోనే ఆమె భర్త మరణించాడు. అప్పటినుండి ఆమె తన జీవితం పరమార్థ సాధనలో గడపదలచింది. త్వరలోనే తన బంధుకోటిని, కుటుంబాన్నీ విడచి వంటరిగా భగవంతుని సేవలో జీవితం గడపసాగింది. ఎంతో నిశితమైన తత్త్వజ్ఞానము, ధ్యానపద్ధతి నేర్చింది. చివరకు ఎన్నో జన్మల పుణ్యంవలన సాయి సన్నిధి చేరింది. శిరిడీ వచ్చేనాటికి ఆమె మహా సౌందర్యవతియైన యువతి. మొదటినుండి ఆమె కృష్ణ భక్తురాలు. నిరంతరమూ ఆమె, 'రాధాకృష్ణ' అనే నామం జపిస్తుండడం వలన ఆమెకు రాధాకృష్ణ ఆయీ అను పేరు వచ్చింది. ఆమె ఎల్లప్పుడూ ఒక కృష్ణ విగ్రహాన్ని దగ్గరుంచుకొని దానికే చిన్నబిడ్డకువలె అన్నీ సేవలు చేస్తుండేది. తరచుగా పండరీ భక్తబృందాలను తీసుకొని పండరిపురం దర్శిస్తుండేది. ఆమెకు ఎంతో మధురమైన కంఠముండేది; ఎన్నో భజనలు, కీర్తనలూ ఆమెకు వచ్చు. ప్రథమ దర్శనంలోనే ఆమె సాయి అనబడు 51/2 అడుగుల మానవాకృతి మాటున దాగియున్న అనంత విశ్వశక్తిని గుర్తించింది. వారినే తన సద్గురువుగా, శ్రీకృష్ణుని ప్రత్యక్షరూపంగా భావించి యావజ్జీవితమూ సేవించింది. ఆమె తనకు కల్గిన ఆధ్యాత్మికానుభవాలు ఏవీ ఎన్నడూ ఎవరికీ చెప్పేది గాదు. అందువలన సాయి ఆమెకు శ్రీకృష్ణుడుగా దర్శనమిచ్చి యుండాలని మనం తలచవచ్చు. లేకుంటే జన్మతః బ్రాహ్మణి, ఆచారవంతురాలైన యీ కృష్ణ భక్తురాలు అందరిచేత ముస్లిం అని తలచబడిన సాయి సన్నిధిలో, సాయిసేవలో తన జీవిత శేషమంతా గడపగల్గేదికాదు. ఎట్టి వర్ణభేదమూ పాటించక, భక్తులందరినీ తన గురుబంధువులుగా చూచుకొనేది. ద్వారకామాయిలోనే ప్రతి సం॥రమూ మహా వైభవంగా గోకులాష్టమి జరిపించేది. అప్పటినుండీ అది శిరిడీలో ఆచారమైనది.

ఈమె శిరిడీలో తన సమయమంతా సాయి సేవలోను, తీవ్రమైన సాధనలోనూ గడిపేది. బాబా తనవద్దకు పంపిన భక్తులకు తన యింట ఆశ్రయమిచ్చి, వారితో మాత్రమే మాట్లాడేది. ఆమె బాబా సంచరించిన వీధులన్నీ స్వయంగా చిమ్మి శుభ్రం

చేసేది. చావడిముందు చిమ్మి, నీళ్ళు చల్లి ముగ్గులు పెట్టేది. ఒకొక్కప్పుడు బాబా లెండీకో, చావడికో వెళ్ళిన సమయం చూసుకొని మశీదు చిమ్మేది. ధునివలన మసిబారిన మసీదు గోడలు తుడిచి శుభ్రంగా చేసేది.

రాధాకృష్ణ ఆయీ ఆధ్యాత్మిక సాధనలో ఎన్నో మెలకువలు తెలిసిన వివేకి. అనన్యంగా తాను ఉపాసించిన శ్రీకృష్ణుడే తనకు సాయిని సద్గురువుగా చూపి వారి సన్నిధి, సేవ ప్రసాదించారని ఆమె అనుక్షణమూ గుర్తుంచుకొనే జీవించింది. బాబాగూడ ఆమె భావం గుర్తించి నిత్యమూ మధ్యాహ్నం భిక్షకు వెళ్ళివచ్చాక శ్యామా ద్వారా ఆమెకొక రొట్టె, కూర పంపేవారు. అదే ఆమెకు భోజనం. సద్గురువే తనకు భుక్తి ముక్తిగూడ ప్రసాదిస్తారని, ప్రసాదించాలనీ ఆమె భావం. ఆమె శ్రద్ధను గ్రహించి, సాయిగూడ విషయవాసనలను జయించిన భక్తులు కొందరిని ఆయీ యింట బసచేయమని ఆదేశించారు. ఆమె యింటిని ఆయన 'శాల' అనేవారు; అంటే 'పాఠశాల' అని అర్థం. ఉత్తమమైన సాధకజీవితం నేర్పే పాఠశాలయే ఆమె యిల్లని వారి భావం గాబోలు; మిగిలిన భక్తులెవరినీ ఆమె యింటికిపొమ్మని చెప్పేవారుగాదు. ఆమెగూడ సామాన్యంగా ఎవరి ఎదుటకు వచ్చేది కాదు. ఇంటినుండి బయటకు వెళ్ళడం తప్పనిసరైనపుడు ముఖంనిండా ముసుగు కప్పుకొని మాత్రమే వెళ్ళేది. ఒకసారి అకస్మాత్తుగా నీమ్ గావ్ కు వెళ్తుంటే ఆమె త్వరత్వరగా వెళ్ళి నమస్కరించుకొన్నపుడు మాత్రమే ఆ తొందరలో ఆమె ముసుగు వేసుకొనడం మరచిపోయింది. ఎన్నోమాసాలు శిరిడీలో గడిపిన ఖాపర్డే ముసుగులేకుండా ఆమెను చూడడమదేనని తన డైరీలో వ్రాసుకున్నాడు. ఆమె తన ఆశ్రమధర్మాన్ని అనుసరించి ఎప్పుడూ తెల్లవస్త్రాలే ధరించేది. వాటిని బాబాయే ఆమెకు పంపుతుండేవారు. రోజు విడిచి రోజు బాబా చావడికి వెళ్ళిన తర్వాత ఆమె మసీదుకు వచ్చి అచ్చటి మెట్ల మీద ఐదు వత్తులుగల ప్రమిదలు పెట్టి, దీపాలు వెలిగించి వెళ్ళేది.

కొందరు భక్తులను ఆమె యింటి వద్ద బసచేయమని బాబా ఎందుకు ఆదేశించేవారో ఆ భక్తుల స్మృతులుచూస్తే తెలుస్తుంది. ఉదా:- వీరిలో తర్వాత 'శ్రీ సాయి శరణానంద' గా ప్రసిద్ధికెక్కిన వామనరావ్ పటేల్ ఒకరు. సదాచార సంపన్నమైన గుజరాత్ బ్రాహ్మణ కుటుంబంలో 1886లో జన్మించిన యితనికి బాల్యంలోనే దైవభక్తి అబ్బింది. అతడు తన 7వ సంవత్సరం నుండీ నిత్యమూ స్థానిక సోమనాథ దేవాలయానికి వెళ్తుండేవాడు. ఒకరోజు దానియెదుట అతనికి ఒక మహాతేజస్వియైన ఫకీరు కన్పించారు. ఆ పిల్లవాడు ఆ దివ్య వర్చస్సుకు మంత్రముగ్ధుడయ్యాడు. తర్వాత అతడు 22వ యేట, అంటే 1911లో మొదటిసారి బాబాను దర్శించి, తనకు 15 సం॥ల క్రిందట దర్శనమిచ్చిన ఫకీరు వారేనని గుర్తించారు. సం॥1913లో వేసవి సెలవుల్లో రెండవసారి శిరిడీ వచ్చాడు. సెలవులయ్యాక అతడు తిరిగి వెళ్ళడానికి సెలవు కోరినపుడు బాబా అనుమతించక సుమారు 11 మాసాలు అతడిని శిరిడీలోనే వుంచేసారు. సం॥ 1916లో ఒక రోజు కొందరు గురుబంధువులను శిరిడీకి సాగనంపాలని రైల్వేస్టేషనుకు వచ్చిన వామనరావ్ చిత్రమైన ప్రేరణవలన కట్టుబట్టలతో తానుగూడ శిరిడీ చేరాడు. అక్కడ సాయి అతనిని చూస్తూనే; 'రా, నేను నీకోసమే ఎదురుచూస్తున్నాను' అన్నారు. ఆయన తననెంతగానో అనుగ్రహించగలరని తలచి పొంగిపోయాడతడు. అప్పట్లో అక్కడ బూటీవాడా కట్టుబడి జరుగుతోంది. ఒకరోజు వామనరావు దాని దగ్గరగా కూర్చుని వుండగా పైనుండి ఒక రాయి జారి అతని తల పై పడింది. అతడు స్పృహతప్పి పడిపోయాడు. ఆ మాట వినగానే బాబా ఒక మందు పంపారు, అది వేయగానే అతనికి స్పృహ వచ్చింది. అతడు కళ్ళు తెరిచేసరికి అతని హృదయమంతా దివ్యమైన పారవశ్యంతో నిండియున్నది. అతడు సం॥1953లో సన్యసించి, శ్రీసాయి శరణానందగా గుజరాత్ ప్రాంతమంతటా నిరంతరం సాయి ప్రచారం చేసారు.

శ్రీ సాయి శరణానంద తమ స్మృతులు యిలా వ్రాసారు; "ఒకసారి నేను దీక్షిత్ వాడాలో బసచేసాను. ప్రఖ్యాత న్యాయవాదియైన ఖాపర్డే, హైకోర్టు జడ్జిగా పనిచేస్తున్న షింగానేగూడ శిరిడీలో వున్నారు. ఒకనాటి సాయంత్రం నేను షింగానేతో కలసి బాబా వద్దకు వెళ్ళాను. ఆయన అందరితోనూ మాట్లాడుతూ షింగానేతో మాత్రం ఎంతో సంతోషంగా అరగంట మాట్లాడి, అతడికెంతో సమృద్ధిగా ప్రసాదం యిచ్చారు. తర్వాత వాడాకు వచ్చేసాము. కొద్దిసేపు ఆగి నేను మళ్ళీ బాబావద్దకు వెళితే ఆయన 'నీవింక వెళ్ళవచ్చు. మళ్ళీ మళ్ళీ తిరిగి రావడం వలన ఒరిగేదేమున్నది?' అన్నారు.

కనుక నేను బయల్దేరి కాలినడకన రహటా రోడ్డుమీద కొంతదూరం వెళ్ళి ఒక చెట్టుక్రింద కూర్చున్నాను. అక్కడ, 'విష్ణుబువా వ్రాసిన గీత చదువు' అని ఒక అశరీరవాణి వినిపించింది. అటు తర్వాతనుండి నిత్యమూ బాబాను ఉదయము, సాయంత్రమూ దర్శించుకోసాగాను. మొదట్లో ఖాపర్డే, షింగానేలతో కలిసి మాత్రమే వెళ్తూండేవాడిని. మూడవరోజు మాతండ్రిగారి జన్మదినం. ఆయన కోరినట్లు నేను బాబాముందు జామపండ్లుంచి, అవి మాతండ్రిగారి జన్మదిన సందర్భంగా సమర్పించుకుంటున్నానని చెప్పాను. అవి అందరికీ పంచమని ఆయనొక భక్తుని ఆదేశించారు. నాటినుండి నేను బాబాను మధ్యాహ్నంగూడా దర్శించేవాణ్ణి. కాని నేను ఆయన వద్దకు వెళ్ళకుండా మసీదు మెట్ల మీదనే కూర్చునేవాణ్ణి. ఒకరోజు నేనక్కడ కూర్చుని వుండగా ఒక భక్తునిద్వారా బాబా నాకొక కలకండ ముక్క పంపారు. అది తినిన కొద్దిసేపట్లో, నేను న్యాయశాస్త్ర పరీక్ష (యల్.యల్.బి) పాసయినట్లు మా నాన్న వద్దనుండి జాబు వచ్చింది. నేనావార్త వాసు కాకాకు చెబితే బాబాకు నైవేద్యం అర్పించమని చెప్పాడు. అప్పుడు హాతేగూడ అక్కడే వున్నాడు. అతడుగూడ పరీక్ష పాసయినట్లు వార్త వచ్చింది. అతనినిగూడ బాబాకు నైవేద్యం అర్పించమని ఒక భక్తుడు చెప్పాడు. వాసు కాకా నైవేద్యం సిద్ధంచేసి, బాబా సాయంత్రం వ్యాహ్యాళికి బయల్దేరకముందే మాకందించాడు. అది ఒక పెట్టెలో పెట్టుకొని బాబావద్దకు తీసుకువెళ్ళాము. అపుడాయన, 'దారిలో దేనినీ పట్టించుకొనకుండా ఈ లడ్డు తీసుకొచ్చావేమి?' అని, ఆ పెట్టె కొండాజీకి యిచ్చారు. అతడా పెట్టె తెరచి ఆయనకు లడ్డు యిచ్చాడు. నాకు బాబా మాటలతో పరిచయం లేనందున వారి భావమేమో నాకప్పుడు అర్థంకాలేదు. కాని కొద్ది సేపటికి తెలిసింది– నేను రోడ్డు మీదుగా వస్తున్నప్పుడు ఒక కుక్క నా వెంబడే వచ్చింది. నేను దానినేమీ పట్టించుకోలేదు. బాబా చెప్పినది దానిని గురించే".

వామనరావ్ పాటిల్ ఎప్పుడు శిరిడీవచ్చినా తన విరామమంతా ఆయీవద్ద గడిపేవాడు. ఆమె మాట్లాడే ప్రతిమాట సాయిమాట అని తలచవచ్చని ఆయన వ్రాశారు. ఆమే ఆయనకు భోజనం చేసేటప్పుడు, సాంఖ్య యోగంలో చెప్పిన తత్వాలకు సంకేతంగా భోజనాన్ని ఎలా భావించాలో నేర్పింది. ఆమెగూడ తన విరామసమయమంతా యిలాంటి సద్భక్తులసాంగత్యంలోనే సాయినామం జపిస్తుండేది. అయితే యింతటి భక్తురాలిని సాయి తమ ఎదుటకు రానిచ్చేవారు కాదు. పొరబాటున ఒకసారి ఆమె ఎదుటపడినపుడు ఆయన ఉగ్రులై ఆమెపై రాళ్ళు విసిరి తీవ్రంగా తిట్టారు.

ఈమె యింట బసచేయమని సాయి ఆదేశించినవారిలో శ్రీమతి తార్ఖాడ్ ఒకామె. కానీ తాను చెప్పిన పనులన్నీ త్రికరణ శుద్ధిగా చేసేట్లయితేనే ఆమెకు ఆశ్రయమిస్తానన్నది ఆయీ. అందులో ఆమెమాట ఎంతో పరుషం; ప్రతి చిన్న పొరపాటుకు ఆమె తీవ్రంగా చివాట్లు పెట్టేది. అందుకు అంగీకరించిన శ్రీమతి తార్ఖాడ్ గూడా బాబా తనకెంతో కఠోరమైన పరీక్ష పెట్టారని తలచి మొదట బాధపడింది. కానీ రోజులు గడిచిన కొద్దీ నిరంతరం సాయిసేవ – సాయి ధ్యానముల వలన ఆయీలో మేల్కొంటున్న దివ్యదృష్టి దివ్యశ్రవణము, ఇతరుల భావాలను గ్రహించగల్గడమూ వంటి శక్తులను శ్రీమతి తార్ఖాడ్ గుర్తించింది. ఎవరినుండైనా శ్రీమతి తార్ఖాడ్ కు కబురువస్తే ఆమె ఏ సమాధానము చెప్పదలుచుకుంటుందో అదే ముందుగా ఆయీ చెప్పి పంపేసేది. సాయి ఎప్పుడు ఎట్టి విచిత్రమైన ఆదేశము పంపించినా, ముందుగానే ఆయీ దానికి తగిన ఏర్పాట్లు చేసేది. ఇవన్నీ చూచాక, తనకు ఆధ్యాత్మిక శిక్షణ యివ్వడానికే సాయి తనను ఆయీ యింట వుంచారని శ్రీమతి తార్ఖాడ్ గుర్తించింది.

రాధాకృష్ణ ఆయిలో బాబాపట్ల తీవ్రమైన శ్రద్ధాభక్తులతో పాటు విశిష్టమైన అధికారము, ఆకర్షణా వుండేవి. ఆమె ఏదైనా చెబితే, కోటీశ్వరుడైన బూటీ దగ్గరనుండి అందరూ తలవంచి ఆ పని చేసేవారు. సాయి నిత్యమూ ఎండలో నడిచి లెండీకి వెళ్ళేవారు. కనుక ఆ దారి పొడుగునా, రెండువైపులా వంచిన ఇనుప కమ్మీలు నాటి, వాటి ప్రక్కనే లతలు మొలిపించాలని సాటి భక్తులందరికీ ఆమె చెప్పింది. అందరూ నడుముగట్టి శ్రమించి ఆ పని పూర్తి చేసారు. నిత్యమూ అందరిచేతా ఆమె మొక్కలకు నీళ్ళు కూడా పోయించేది. కొద్ది కాలానికి అవి బాగా పెరిగి అల్లుకొని, లెండీకి వెళ్ళే మార్గమంతా ఒకే పందిరిలా అయింది. బాబా వాటి క్రిందనే నడచి లెండికి వెళ్ళేవారు.●

# ద్వారకామాయి అనుభవమండపము

***ఒక సాయి భక్తుడు***

శ్రీ సాయిబాబా చరిత్రంతా భక్తులను ఆయన ఆదరించి రక్షించిన మధుర ఘట్టాల పన్నీటి జల్లు. అప్పుడప్పుడాయనకు నిష్కారణంగానో, కారణంగానో భక్తులపై పట్టరాని ఆగ్రహము రావడము, ఆయన వారిని తీవ్రంగా తిట్టడం, కొట్టడమూ జరిగినట్లు చదువుతాము. వారి మహాసమాధి అనంతరంగూడ ఆయన నిత్యం యీ లీలావిలాసము యిలానే చేస్తున్నారు.

ప్రకాశంజిల్లా ఒంగోలు పట్టణానికి సమీపంలో ఒక గ్రామం వలపర్ల. అక్కడ అవ్వారి కోటేశ్వరరావు, వెంకాయమ్మ అనే దంపతులున్నారు. వారు ఆర్థికంగా క్లిష్ట పరిస్థితులలో వున్న సమయంలో ఒక సాయి భక్తుడు సాయిబాబా విభూతి పొట్లమిచ్చి పూజలో పెట్టుకొని పూజించుకోమన్నాడు. అలానే చేసినప్పటినుండి ఆ కుటుంబం పరిస్థితి కొంతమెరుగైంది. అటుతర్వాత ఎన్నో సందర్భాలలో ఆ కుటుంబాన్ని సాయి ఆదుకొన్నారు.

అది 1983. ఆ దంపతులకు మల్లీశ్వరి అను మూడు సం॥ల మనుమరాలున్నది. ఒకసారి ఆ పాపకు ఒక వారం రోజులు విడవకుండా విరేచనాలు అవుతూనే వున్నాయి. ఎన్ని మందులిచ్చినా కించిత్తుగూడ ఆగలేదు. చివరికి వైద్యులు సెలైను ఎక్కించాలని చూచినా వారి వల్లగాలేదు. ఆ పాప తల్లిదండ్రులు, తాత – అమ్మమ్మలు సాయిని ప్రార్థిస్తున్నారు. తరచూ యింట్లో కొస్తుండే ఒక పిల్లి వచ్చి ఆ పాప మంచానికి రాసుకుంటూ పూసుకుంటూ దాని చుట్టూరానే తిరుగుతున్నది. పిల్లి అపశకునమని తలచి అందరూ దానిని తరమమని ఎంతగానో ప్రయత్నించారు గాని అది వెళ్ళనేలేదు. చివరికొకరికి స్ఫురించింది – ఆ రూపంలో బాబాయే పాపకు తోడై రక్షిస్తున్నారేమోనని. వారికా భావం కల్గగానే పాప పరిస్థితి మెరుగుకాజొచ్చి కొద్ది రోజులలో స్వస్థత చేకూరింది. వైద్యులుగూడ ఆశ్చర్యపోయారు.

తర్వాత కొంతకాలం గడిచింది. ఒకరోజు యింటిల్లిపాదీ పొలం పనులకు వెళ్ళారు. ఆ పాప పొరుగిళ్ళ దగ్గర ఆడుకొంటున్నది. సుమారు మధ్యాహ్నం 12 గం॥కు వాళ్ళ యింటి ముందున్న నీటితొట్టిలో నీళ్ళు అలజడిగా కదులుతూంటే చూచి దారిపోయే ఒక వ్యక్తికి అనుమానంతోచి అతడువెళ్ళి తొంగిచూచాడు. ఆ పాప తాను ఆడుకొనే గిలక్కాయ తొట్టిలో పడిపోతే దానికోసమని అందులోకి వంగి అందులో పడిపోయింది! ఎంతసేపైందో గాని ఏమీ అపాయం జరుగలేదు. అందులోంచి తీసి మంచంమీద పడుకోబెట్టగానే తననొక తాత పట్టుకొన్నాడని పాప చెప్పింది. ఆ తాత బాబాగాక ఎవరైవుంటారు?

కోటేశ్వరరావు, వెంకాయమ్మలకు ఏడుకొండలనే 14 సంవత్సరాల కొడుకున్నాడు. అది 1984లో కార్తీకమాసం. ఆ అబ్బాయి రోజూ యింట్లో సాయంత్రం బాబాకు దీపం పెట్టేవాడు. ఒకరోజు తండ్రి కోటేశ్వర రావు పనిబడి చీరాల వెళ్ళాడు. సమయం సాయంత్రం 6 గం॥లు తల్లి స్నానానికి వెడుతున్నది. ఇంతలో అబ్బాయి సినిమాకని బయలుదేరాడు. బాబాకు దీపం పెట్టివెళ్ళమని చెప్పింది

**మిగతా 29వ పేజీలో**

# ఆచార్యుని అద్భుత లీలలు

### శ్రీ వెంకటేశ్వరరావు

పూజ్యశ్రీ భరద్వాజ్ మహరాజ్ లీలా వైభవాన్ని కాకినాడ వాస్తవ్యులు, వెంకటేశ్వరరావుగారు ఈ విధంగా తెలియచేస్తున్నారు.

1996 సంవత్సరంలో గోపాలరావుగారు అనే ఆయనతో శిరిడి వెళ్లాను. అక్కడ మాటల సందర్భంలో "నేను ఇల్లు కట్టుకోవాలనుకుంటున్నాను, నువ్వు కట్టిపెడతావా?" అనడిగారు. నేను తాపీ మేస్త్రి పని చేస్తాను, కనుక "సరేనండి" అని చెప్పాను. ఆయన సాయిమాస్టర్ సత్సంగ సభ్యులు. నేను బాబా గుడికి వెళ్ళేవాడిని కానీ, సత్సంగ సభ్యులతో పరిచయం లేదు. శిరిడి నించి వచ్చాక, అనుకున్నట్లు గానే, వారు ఇల్లు మొదలుపెట్టారు. నేను మేస్త్రి పనికి వెడుతున్నాను.

నాకు పాటలు రాసే అలవాటు వుంది, ఎక్కువగా అమ్మవారిమీద పాటలు రాసేవాడిని. ఒకరోజు గోపాలరావుగారు, "నువ్వు పాటలు రాస్తావు కదా, పూజ్యశ్రీ మాస్టరుగారి మీద పాటలు రాయకూడదా? మా సత్సంగంలో పాడుకుంటాము" అన్నారు. "నాకు వారి గురించి ఏమి తెలియదండి, వారిగురించి చెప్తే అప్పుడు రాయడానికి ప్రయత్నం చేస్తాను" అన్నాను. అప్పుడు ఆయన "నాకు తెలిసిన సాయి మాస్టర్" పుస్తకం ఇచ్చి, "ఇది చదివితే నీకు కొంత అవగాహన కలుగుతుంది, అప్పుడు రాయి" అన్నారు. "ఆయన ఎలా వుంటారో నాకు తెలియదు కదండీ, ఆయనది, ఒక ఫోటో కూడా యివ్వండి" అనడిగాను. అర్ధపద్మాసనంలో కూర్చున్న ఫోటో ఇచ్చారు. అందులో పూజ్యశ్రీ మాస్టరుగారిని చూడగానే, ఎంతో ఆత్మీయులని చూసినట్టు అనిపించింది. 'ఈయన చాలా గొప్పవారే అయి వుంటారు, లేకపోతే ఈయన మీద పాట ఎందుకు రాయమంటారు?' అనుకుని, వారు యిచ్చిన పుస్తకం కళ్ళకి అద్దుకుని, మధ్యలో ఒక పేజీ తెరిచాను. అందులో విద్యానగర్ గుడి కట్టేటప్పుడు, స్లాబ్ పని సగం చేసి కూలీలు వెళ్లిపోవడం, తరవాత వేరేవాళ్లు వచ్చి పనిపూర్తి చెయ్యడం, అర్ధరాత్రి బాగా వర్షం పడటం అనే సన్నివేశం వచ్చింది. నాకు అప్పుడే ఒళ్ళు పులకరించింది. నేను ఏ పని చేస్తానో, దానికి సంబంధించిన లీల వచ్చిందంటే, ఈయనెవరో సామాన్యుడు కాదు అనుకున్నాను. గోపాలరావుగారు, "ఇంటికి తీసుకెళ్లి, బాగా చదివి అప్పుడు రాయి" అన్నారు. సరేనని ఆ పుస్తకం సంచిలో పెట్టేసుకున్నాను.

మేము కాకినాడనించి, పదిహేను కిలోమీటర్ల దూరం లో వున్న పల్లెటూరిలో వుండే వాళ్ళం. నేను రోజూ సైకిల్ మీ వచ్చేవాడిని. ఆ రోజు కూడా, పని అయ్యాక సైకిల్ మీద ఇంటికి వెడుతున్నాను. ఇందాక పుస్తకం తీయగానే నాకు సంబంధించిన లీలే రావడం గురించి ఆలోచిస్తున్నాను. అలా వెడుతుండగా నాకు ఒక దర్శనం అయింది. రోడ్డుకి అడ్డంగా, ఒక తెర కట్టివుంది. దానిమీద "భరద్వాజ భక్తి గీతాలు" అన్న అక్షరాలు కనపడుతున్నాయి. ఇక్కడ ఏదో జరుగుతోంది చూద్దామని, దగ్గరకి వెళ్లేసరికి తెర కనపడడంలేదు. 'భరద్వాజ భక్తి గీతాలు' అని కనపడుతున్నాయేమిటని ఆశ్చర్యపోతూ, మళ్ళీ కొంత దూరం వెళ్లేసరికి మళ్ళీ అలాగే కనిపించింది. అలా మూడు సార్లు జరిగింది. 'భరద్వాజ మాస్టరుగారు మామూలు వారు కాదు, మేలిమి బంగారం లాంటివారన్నమాట. లేకపోతే ఏమిటీ చిత్రం' అనుకోగానే, నా హృదయంలోనుంచి ఏదోపాట వస్తోంది. సైకిల్ ఆపుకుని పెన్ను, పేపరు తీసుకుని రాసేసాను. "బంగారు

మా తండ్రి గురుభరద్వాజా" అన్న పాట వచ్చింది. ఇంటికి చేరుకొని, స్నానం భోజనం అయ్యాక, గోపాలరావుగారు యిచ్చిన పుస్తకం తిరగేసాను. అందులో అమ్మగారి గురించి కూడా వుంది. ఇందాక దారిలో నేను రాసిన పాటని క్రమపద్ధతిలో పెట్టాను. అప్పుడు ఒక ఆలోచన వచ్చింది. 'అయ్య వెనకాల అమ్మ కూడా ఉంటుంది కదా, ఆ అమ్మ యెంత గొప్పదో' అన్న ఆలోచన రాగానే, "అమ్మా మా యమ్మా అలివేలు మంగమ్మా" పాట వచ్చింది. పూజ్యశ్రీ మాస్టరుగారి దయవల్ల ఆ వారంలో 9 పాటలు వచ్చాయి. అవన్నీ చిన్న పుస్తకం కింద వేయించాము..

గురువారం రాయడం మొదలుపెడితే మళ్ళీ గురువారానికి తొమ్మిది పాటలు వచ్చాయి. ఆరోజు రాత్రి స్వప్నం వచ్చింది. అందులో పాటల పుస్తకాలన్నీ ఒక బుట్టలో పెట్టుకుని, ఒంగోలులో అమ్మగారికి చూపించాలని గబాగబా వెళ్ళిపోతున్నాను. మెలకువ వచ్చేసింది. అప్పుడు నేను మొదట ఒంగోలు వెళ్లి అమ్మగారికి ఈ పాటలు చూపించి, అప్పుడు అందరికి పుస్తకాలు యివ్వాలని అనుకున్నాను. వెంటనే ఒంగోలు వెళ్లి పూజ్యశ్రీ అమ్మగారిని దర్శించుకున్నాను. అక్కడ అ ఇద్దరు ముగ్గురు ఆడవాళ్లు కూడా వున్నారు. అమ్మగారికి నమస్కారం చేసుకున్నాను. వారు ఆప్యాయంగా పలకరించారు. నేను ఇలా పూజ్యశ్రీ మాస్టరుగారి మీద పాటలు రాశానని చెప్పాను. "అయితే పాడతారా" అన్నారు. 'అలాగేనమ్మా' అని పాడి వినిపించాను. పూజ్యశ్రీ అమ్మగారు చాలా సంతోషించారు. ఊది, ప్రసాదం యిచ్చారు. నేను అక్కడి నించి బాబా గుడికి వెళ్లి, పూజ్యశ్రీ మాస్టరుగారి సమాధి దర్శనం చేసుకుని, సంతోషంగా తిరిగి వచ్చాను.

కాకినాడ వచ్చాక, ఈ పాటలు CD లో చెయ్యాలని చాలా ప్రయత్నం చేసాను. ప్రతిసారి ఏదో అడ్డం వచ్చేది. ఎందుకు యిలాగ అవుతోందని, నాకు బాగా తెలిసిన ఆయనని అడిగితే, "అవన్నీ డబ్బుతో కూడిన వ్యవహారాలు, మనలాంటి వాళ్ళకి అవి కుదరవు, తీరా కేసెట్ చేసాక అమ్ముడవ్వక పొతే ఆర్ధికంగా నష్టపోతావు" అని చెప్పారు. కానీ, దేశవిదేశాలలో ఎంతోమంది బాబా భక్తులు వున్నారు కదా, వారందరికీ బాబా నాలుగు హారతులు, మన ఆంధ్రప్రదేశ్ లో వున్న ఇతర దేవతల గుళ్ళు ఇవన్నీ, వీడియోలు తీసి, అందరికి ప్రచారం చెయ్యాలన్న ఒక ఆశయంతో అనండి లేదా ఆవేశంతో అనండి ఈ వీడియోలు తీసే కార్యక్రమం మొదలుపెట్టాను. ఈ వ్యవహారమంతా ఇంట్లో గాని, సత్సంగ సభ్యులతో గాని చెప్పలేదు. నా తాహతుకుమించి చేసి, చాలా డబ్బు నష్టపోయాను. పూజ్యశ్రీ మాస్టరుగారి, మార్గం నించి కూడా పక్కకి వెళ్ళిపోయాను. ఆరు సంవత్సరములు ఎవ్వరితోను కలవలేదు. తరవాత మళ్ళీ పూజ్యశ్రీ మాస్టరుగారి దయవల్ల నెమ్మదిగా సత్సంగ సభ్యులతో కలవడం మొదలు పెట్టాను. మళ్ళీ ఈసారి తొమ్మిది పాటలు రాసాను. మొదట రాసిన పాటలు, రెండవసారి రాసిన పాటలు కలిపి, ఒక పుస్తకంగా ముద్రణ చేయించి ఒంగోలులో జరిగిన కృతజ్ఞతా మహోత్సవంలో అందరికి పంచాము.

నాకు 2014లో ఆరోగ్యం దెబ్బతింది. ఆ సమయంలో నా జీవితంలో పూజ్యశ్రీ మాస్టరుగారి మార్గం నించి దూరమయ్యి పారాయణలు అశ్రద్ధ చేసిన రోజుల గురించి ఆలోచించుకుని, శ్రీ గురుచరిత్ర,108 పారాయణలు చెయ్యాలని నిర్ణయం తీసుకున్నాను. అదికూడా ప్రతి పౌర్ణమికి ఏకాహ పారాయణ చేస్తానని దణ్ణం పెట్టుకున్నాను. ఆ పారాయణ చేస్తున్నప్పుడు, గంధర్వపురం గురించి చదువుతున్నప్పుడు నేను ఎప్పుడైనా గాణ్గాపురం వెళ్లగలనా అనుకునేవాడిని. 20 పారాయణలు అయ్యేసరికి, గాణ్గాపురంలో జరుగుతున్న తంతుకసేవలో పాల్గొనడానికి అవకాశం వచ్చింది. పూజ్యశ్రీ మాస్టరుగారి దయ ఎంతటిదంటే, సుమారు సంవత్సరం పాటు గాణ్గాపురంలో సేవచేసుకునే అవకాశం వచ్చింది. అక్కడ గాణ్గాపురాన్ని వర్ణిస్తూ పాటలు రాసాను. మళ్ళీ మాస్టరుగారి మీద ఏడు పాటలు రాసాను. మూడు భాగాలు పూర్తయ్యాయి. ఇప్పుడు నాలుగవ భాగం కూడా రాస్తున్నాను. తరవాత విద్యానగర్ తపోవనంలో కూడా పూజ్యశ్రీ మాస్టరుగారి దయవల్ల సేవ దొరికింది. ఎక్కడ సేవ చేసినా అది పూర్తిగా మాస్టరుగారి సహాయ సహకారాలు లేనిదే జరగదని మాకు చాలా సార్లు అనుభవమయ్యింది.

ఒకసారి సాయి సన్నిధి గ్రంథం పారాయణ అందరికి యిచ్చినప్పుడు, మేము యలమంచిలి అనే ఊరికి గ్రంథాలు పట్టుకుని వెళ్ళవలసి వచ్చింది. నేను, మా సత్సంగ సభ్యుడు మురళి గారు కలిసి ఆ మూడు వందల పుస్తకాలు పట్టుకుని ట్రైన్ ఎక్కాము. యలమంచిలిలో రైలు దిగాక బయటకి

వెళ్ళడానికి ఫ్లాట్-ఫారం బ్రిడ్జి ఎక్కి, అవతల పక్కకి వెళ్ళాలి.. ఇద్దరం చెరొక వంద పుస్తకాల కట్ట, భుజాల మీద పెట్టుకున్నాము. ఇంకొక వంద ఒక సంచిలో పెట్టుకుని, చెరొక వైపు పట్టుకున్నాము కానీ అలా నడవడం మా వల్ల కావటంలేదు. ఎలాగరా బాబూ ఇక్కడనించి బయటపడటం అనుకుంటూ, పూజ్యశ్రీ మాస్టరుగారికి, మీరే దయచూడాలని, మనసులో నమస్కారం చేసుకున్నాము. ఇంతలో ఒకతను మా దగ్గరకి వచ్చాడు. అతనికి కాలూ చెయ్యి అవకరం వుంది. మామూలుగా నడవడానికే అతనికి కష్టం. అలాంటిది, మా దగ్గరికి వచ్చి, మేము చూస్తుండగానే, "ఏది, ఆ సంచి యిటివ్వండి, అని మేమిద్దరం పట్టుకున్న బాగ్ తీసుకున్నాడు, అప్పుడు మురళి గారు, తను ఇంతకుముందు పట్టుకున్న పుస్తకాల సంచి, నాకు ఇచ్చేసి, అతనికి ఒకవైపు సాయంగా సంచి పట్టుకున్నారు. అతను మధ్యలో ఒక్క మాట కూడా మాట్లాడకుండా, బ్రిడ్జి దిగి ఆటోలు ఉన్న స్థలం దగ్గర ఆ సంచి దింపేశాడట. ఈలోపున మురళిగారు, నేను రెండు సంచులు పట్టుకుని వెనకాల వస్తున్నానుకదా, అవి అందుకోవడానికోసం నా దగ్గరికి వచ్చారు, ఆయన నేను కూడా అక్కడికి చేరాక అతనికి డబ్బులు ఇద్దామనుకున్నారట,. కానీ మేముద్దరం వెళ్ళేసరికి అతను అక్కడ లేడు. చుట్టుపక్కల వెతికినా కనిపించలేదు. చాలా ఆశ్చర్యం వేసింది. పూజ్యశ్రీ మాస్టరుగారికి మరొక్కసారి, మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు చెప్పుకున్నాము. అనుకున్న సమయానికి, మధ్యాహ్న హారతికి బాబా గుడికి వెళ్లి, సాయి సన్నిధి గ్రంథాలు పంచడం జరిగింది. ఇది ఎందుకు చెప్పానంటే, ఇలాంటి లీలలు వారు చేసి, మనలాంటి వారివల్ల ఏమికాదు అని నిరూపిస్తూవుంటారు...

పూజ్యశ్రీ మాస్టరుగారి దయవల్ల కాకినాడ రంగయ్యనాయుడు వీధిలోని బాబాగుడిలో పూజ్యశ్రీ మాస్టరుగారి విగ్రహాన్ని ప్రతిష్ట చేసుకున్నాము. అప్పుడుకూడా ఒక లీల జరిగింది. మర్నాడు విగ్రహప్రతిష్ట అనగా ముందురోజు రాత్రికి కూడా విగ్రహం రాలేదు. రవాణాసమస్య కారణంగా అలా జరిగింది. కానీ మేము అందరికి చెప్పుకుని, మర్నాటికి అన్ని ఏర్పాట్లు చేసేసుకున్నాము. ఇక ఏంచెయ్యాలో తెలియక, కొంతమంది కలిసి, గురుచరిత్ర పారాయణ ఆ రాత్రి అంతా చేసాము. మర్నాడు విగ్రహప్రతిష్ట సమయానికి ఒక పావుగంట ముందు పూజ్యశ్రీ మాస్టరుగారు విగ్రహరూపంలో, అన్ని అడ్డంకుల్ని దాటుకుని వచ్చారు. అనుకున్న సమయానికి ప్రతిష్ట జరిగింది. ప్రస్తుతం మేము కొంతమందిమి, ఆ గుడిలో సత్సంగం పారాయణ, భజన విధిగా చేసుకుంటూ పూజ్యశ్రీ మాస్టరుగారిని సేవించుకుంటున్నాము.

నాకు తగినంత శ్రద్ధాభక్తులను ప్రసాదించి, సరైన మార్గంలో నడిపించమని, గురుదేవులను ప్రార్థిస్తూ సాష్టాంగ దండ ప్రణామాలర్పిస్తున్నాను.

జై సాయి మాస్టర్!

## ద్వారకామాయి అనుభవ మండపం

27వ పేజీ తరువాయి

తల్లి. సినిమాకు టైమైపోతోందని చెప్పి తను వెళ్ళాలని చూచాడు. కాని అమ్మ 3, 4 సార్లు చెప్పగానే అతడు సరేనన్నాడు. ఆమె స్నానానికి గదిలోకి వెళ్ళిన క్షణంలోనే ఆమెకు అతడి వెఱ్ఱికేక విన్పించింది. అతడికి కరెంటుషాకు తగిలిందేమోనని తోచి ఆమె పరుగున వచ్చేసరికి అబ్బాయి భయంతో వాకిట్లోకి పరిగెత్తాడు. వళ్ళంతా గజగజా వణకిపోతున్నాడు. కళ్ళనిండా నీరు. ఆమె కారణమడుగగా అతడు భయాన్ని అణచుకుంటూ తాను దీపం పెట్టబోతుంటే అచటి చిత్రపటంలోంచి శ్రీ బాబా బయటకువచ్చి అతణ్ణి గట్టిగా కొట్టి అదృశ్యమయారట! అది విని ఆశ్చర్యబోయిందా తల్లి. తర్వాత తెప్పరిల్లి, అతడు వివరిస్తూంటే విని "నీవు ఆయనకు దీపం పెట్టకుండా వెళ్ళాలనుకున్నావు. అందుకే కొట్టి వుంటాడ"న్నది ఆమె. ఆమె సమక్షంలో కొంత ధైర్యం తెచ్చుకొని అతడు దీపం వెలిగించాడు. ఆ రోజు నుండి అతడి ఆరోగ్యంలో చెప్పలేనంత మార్పు కల్గింది. అంత వరకూ బహు బలహీనంగా, సన్నగా ఉండే, అతి సున్నితమైన ఆరోగ్యం కల్గివుండే ఏడుకొండలు త్వరలో కొంత బలంగా, దృఢంగా తయరయ్యాడు. సాయి కొట్టిన దెబ్బ గూడ ఆశీర్వచనమే!!!

ఒక సాయి భక్తుడు. •

జై సాయి మాస్టర్!

# శ్రీ 'సాయిబాబా' పాఠకులకు విజ్ఞప్తి

పూజ్యశ్రీ మాస్టరుగారి దివ్య బోధనలను, వివిధ మహాత్ముల గూర్చిన విషయ విశేషములు, ఇంకా ఇతరములైన ఎన్నో ఆధ్యాత్మిక, విజ్ఞాన విషయాలను పఠించడం ద్వారా పూజ్యశ్రీ మాస్టర్‌గారి సాన్నిధ్యాన్ని అనుభవిస్తూ, ఆనందిస్తున్న 'సాయిబాబా' మాసపత్రిక పాఠకులకు కృతజ్ఞతాపూర్వక నమస్కారములు.

పూజ్యశ్రీ భరద్వాజ మాస్టర్‌గారి 80వ జన్మదిన సందర్భంగా శ్రీ మాస్టరుగారితో భక్తులకు గల అనుభవాలను అక్టోబరు 2017 సంచిక నుండీ ధారావాహికంగా ప్రచురిస్తున్నాము. కనుక పాఠకులు పూజ్యశ్రీ మాస్టరుగారితో తమకుగల అనుభవాలను పత్రికకు పంపవలసినదిగా ప్రార్థన.

అదే విధంగా శ్రీ సాయినాథునితో తమకుగల అనుభవాలను గూడా పంపవలసినదిగా ప్రార్థన.

పూజ్యశ్రీ మాస్టరుగారితో గల అనుభవాలను 'ఆచార్యుని అద్భుతలీలలు' అను శీర్షికకు, శ్రీ సాయినాథునితో గల అనుభవాలను 'ద్వారకామాయి అనుభవమండపము' అను శీర్షికకు పంపగలరని మనవి.

ఇట్లు
ఎడిటర్.

**SRI GURUPADUKA PUBLICATIONS,**
**C/O SRI MANGA BHARADWAJA TRUST,**
Regd. Office: Bhakta Nivas, 12-1-170/46P, Hanuman Nagar, Jaipuri Colony, Nagole, Hyderabad - 68
Phone : +91 - 74160 41550

**పరమ పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ మాస్టరుగారిచే రచించబడిన అపూర్వ ఆధ్యాత్మిక వైజ్ఞానిక గ్రంథములు**


**SRI GURUPADUKA PUBLICATIONS, C/o.SRI MANGA BHARADWAJA TRUST**

**Regd.Office:** Bhakta Nivas, 12-1-170/46P, Hanuman Nagar, Jaipuri Colony, Nagole, Hyderabad-68.

Phone: +91 - 74160 41550

**Branch Office** : Kondaiah Bunk Street, Kothapeta, Ongole, Prakasam Dist. Andhra Pradesh.

Phone:08592 233271


Send DD in favour of **"Sri Manga Bharadwaja Trust (Publications)", payable at Hyderabad or Ongole.**

| | |
|---|---|
| శ్రీ సాయి లీలామృతం-శ్రీ గురు చరిత్ర (Bound) | 450-00 |
| శ్రీ సాయి లీలామృతం | 99-00 |
| శ్రీ గురు చరిత్ర | 99-00 |
| శ్రీ సాయి సన్నిధి | 120-00 |
| శ్రీ సాయి మాస్టర్ ప్రవచనములు | 125-00 |
| శ్రీ సాయినాథ ప్రభోధామృతము | 80-00 |
| సాయినాథ పూజ | 40-00 |
| సాయినాథ స్థవనమంజరి | 10-00 |
| శిరిడి ఆరతులు | 15-00 |
| సాయిబాబాను సేవించడమెందుకు | 10-00 |
| సత్సంగము - భజన | 5-00 |
| శిరిడి క్షేత్ర సందర్శనము | 40-00 |
| విజ్ఞాన వీచికలు | 99-00 |
| పరిప్రశ్న | 99-00 |
| మతమెందుకు? | 20-00 |
| ఏది నిజం? | 25-00 |
| ధ్యానయోగ సర్వస్వం | 99-00 |
| బుద్ధధ్యాన హృదయం | 49-00 |
| దత్తావతార మహత్మ్యం | 75-00 |
| సంహితాయన గురు ద్విసాహస్రి | 125-00 |
| పురుషసూక్త రహస్యం | 40-00 |
| సాయిసూక్తి - ఆచార్యవాణి | 10-00 |
| శ్రీ పాకలపాటి గురువుగారు | 49-00 |
| అవధూత శ్రీ చీరాలస్వామి | 49-00 |
| అవధూత శ్రీ వెంకయ్యస్వామి | 70-00 |
| శ్రీ ఆనందమాయి అమ్మ | 49-00 |
| టిబెట్ యోగి మిలారేపా చరిత్ర | 80-00 |
| శ్రీ హజరత్ తాజుద్దీన్ బాబా చరిత్ర | 49-00 |
| స్వామి సమర్థ (అక్కల్కోట స్వామి) | 49-00 |
| మనము - మన సంస్కృతి | 70-00 |

**ఇతర ప్రచురణలు**

| | |
|---|---|
| మహాత్ముల ముద్దుబిడ్డడు | 120-00 |
| అవధూత చివటం అమ్మ | 70-00 |
| శ్రీ సిద్ధారూఢ స్వామి చరిత్ర | 70-00 |
| శ్రీ సాయి మాస్టర్ స్మృతులు - పార్ట్-1 | 125-00 |
| మరో నందదీపం | 80-00 |
| ఆచార్య అమృత లేఖావళి | 40-00 |
| భగవాన్ శ్రీ భరద్వాజ | 175-00 |
| బాలల శ్రీ సాయి లీలామృతము | 25-00 |
| మహాపురుషుడు | 50-00 |
| శ్రీ సాయి మాస్టర్ స్మృతులు - పార్ట్-2 | 125-00 |
| బాలల శ్రీ సాయి సన్నిధి | 50-00 |
| బాలల శ్రీ గురు చరిత్ర | 50-00 |
| శ్రీ సాయి మాస్టర్ నిత్యసత్య వ్రతము | 15-00 |
| మాష్టారు అమృత వాక్కులు | 100-00 |


## BOOKS IN ENGLISH

| | |
|---|---|
| Sai Baba the Master | 175-00 |
| Sree Guru Charitra | 99-00 |
| Supreme Master (Swami Samartha) | 99-00 |
| Sai Baba of Shiridi and His Teachings | 99-00 |
| Life and Teachings of Hazarat Tajuddin Baba | 99-00 |
| Children's Sai Baba the Master | 60-00 |

## BOOKS IN OTHER LANGUAGES

| | |
|---|---|
| Sadguru Sai Baba (Hindi) | 150-00 |
| Sai Leelamrutham (Kannada) | 150-00 |
| Sai Baba Jeevitha Charitham (Malayalam) | 220-00 |
| Sai Baba Leelamrutham (Tamil) | 175-00 |
| Sri Guru Charitra (Hindi) | 99-00 |
| Swami Samartha (Kannada) | 50-00 |
| Sri Guru Charitra (Kannada) | 99-00 |
| Shiridi Aarathi (Tamil) | 15-00 |
| Stavana Manjari (Tamil) | 10-00 |
| Tibet Yogi Milarepa Jeevitha Charitra (Kannada) | 55-00 |
| Sri Sainath Prabodhamruthamu (Kannada) | 65-00 |
| Sai Sannidhi (Kannada) | 120-00 |
| Sri Guru Charitra (Malayalam) | 150-00 |
| Sri Guru Charitra (Oriya) | 150-00 |





పూజ్య గురుదంపతుల (పూజ్యశ్రీ ఎక్కిరాల భరద్వాజ గురుదేవులు మరియు పూజ్యశ్రీ అలివేలు మంగతాయారు గారు) కల్యాణ మహోత్సవము 4,5 మార్చి 2022 తేదీలలో శ్రీ అలివేలు మంగమ్మ భరద్వాజ దివ్యసన్నిధి, గుమ్మళంపాడు, సంతనూతలపాడు మం., (ఒంగోలు)లో భక్తిశ్రద్ధలతో వైభవంగా జరిగింది.

Date of Publication: 21st of each month. Permitted to post: 23rd, 24th, 25th and 26th of each month.
Edited, Printed and Published by Dr. R.S. Sasidhar, Ph.D. trustee of Sri Manga Bharadwaja Trust,
Ongole - 523002. Postal Registration Number : Prakasam/16/2021-2023, Regd.No. 37926/83.





IF UNDELIVERED, PLEASE RETURN TO: SRI MANGA BHARADWAJA TRUST, KONDAIAH BUNK STREET,
KOTHAPETA, ONGOLE, PRAKASAM DT., A.P. - 523002.